Follow: @ANNTELUGU

02-09-2026

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 236 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


జనం గుండెల్లో.. తిరుగులేని జనసేనాని

మహా పత్రిక బుధవారం, హైదరాబాద్ 02-09-2026

మహా ప్రత్యేకం 04

ఒక మనిషి.. రెండు ప్రస్థానాలు

కోట్లాది హృదయాల్లో చెరగని ముద్ర

- తెరపై తిరుగులేని హీరో.. రాజకీయాల్లో ఓటమిని జయించిన యోధుడు!
- 2019లో రెండు పరాజయాలు.. ఐదేళ్లలోనే 21కి 21 విజయాలు
- పిఠాపురం నుంచి అసెంబ్లీకి.. ఉప ముఖ్యమంత్రి పీఠానికి
- పరాజయం నేర్పిన పాఠం.. విజయం చెప్పిన సమాధానం
- జనసేనాని జన్మదినం సందర్భంగా మహాపత్రిక స్పెషల్ స్టోరీ

సెప్టెంబరు 2న ఆయన జన్మదినం సందర్భంగా మహాపత్రిక ప్రత్యేక కథనం.

(మహా ప్రత్యేకం) : ఒక సాధారణ కుటుంబంలో పుట్టిన బాలుడు.. మార్షల్ ఆర్ట్స్ పై మక్కువ పెంచుకున్న యువకుడు.. అన్నయ్య అడుగుజాడల్లో సినీ రంగంలోకి వచ్చిన నటుడు.. అక్కడ తనకంటూ ప్రత్యేకమైన శైలిని సృష్టించుకున్న 'పవర్‌స్టార్'.. ఆ తర్వాత ప్రజా సమస్యలపై స్పందించిన సామాజిక కార్యకర్త.. రాజకీయాల్లోకి వచ్చి తొలి అడుగుల వద్దే ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న నాయకుడు.. ఓటమితో వెనక్కి తగ్గకుండా పార్టీని నిలబెట్టుకున్న జనసేనాని. చివరకు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదిగి ఉప ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన నాయకుడు.. ఇదే కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రస్థానం.

సినిమా స్టార్ డమ్ మధ్యే సామాజిక స్పృహ

బాలుడి నుంచి 'పవర్‌స్టార్'.. పవర్‌స్టార్ నుంచి 'జనసేనాని'

## పవన్.. తిరుగులేని పవర్

(మహా ప్రత్యేకం)

రాజకీయాల్లో ఆయనది ఒక చరిత్ర. ఎన్నో అటుపోట్లు తిని పైకి ఎదిగారు. ఎన్నో దెబ్బలు తిన్న తర్వాత తనను తాను ఓ శక్తిగా మలచుకున్నారు. ఎవరు ఎంత విమర్శించినా తాను నమ్ముకున్న సిద్ధాంతం ప్రకారం ముందుకు కదిలారు. ఆయనే కొణిదెల పవన్ కల్యాణ్. ఎంతోమంది తనను రాజకీయాలు వదిలేయమని అన్నారు. కానీ అతను మాత్రం ముందుకు కదిలారే కాని వెనక్కు తగ్గలేదు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు లాగా మొక్కవోని ధైర్యంతో ముందుకు కదిలారు. అలా 2014 మార్చి 14వ తేదీన జనసేన పార్టీని సినీనటుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. 2019లో భీమవరం, గాజువాక రెండు చోట్లా పోటీ చేసి ఓడిపోయారు. కానీ పవన్ మాత్రం వెనక్కు తగ్గలేదు. తాను నమ్ముకున్న చాణక్య నీతితో అంతకంటే బలంగా దూసుకొచ్చి ఇండియాలోనే సెన్సేషన్ అయ్యాడు. ఎంతోమంది సీఎంలకు, సెంట్రల్ మినిస్టర్ లకు పవన్ తెగువే స్ఫూర్తి. పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మహాపత్రిక ప్రత్యేక కథనం

పేజీ 4లో


టాప్ న్యూస్



## వచ్చే ఏడాది ఏఐ 'సూపర్‌హ్యూమన్

- కోడింగ్‌లో ఏఐ మానవులకంటే మెరుగ్గా పనిచేస్తుందని ప్రకటన
- సైబర్ సెక్యూరిటీలో ఏఐ ఆధిపత్యం సాధిస్తుందని మస్క్ వ్యాఖ్య


02



## హైడ్రా ఛీఫ్ రంగనాథ్ కు ఊరట

- హైకోర్టు కీలక నిర్ణయం
- సింగిల్ జడ్జి తీర్పును తాత్కాలికంగా పక్కన పెట్టిన హైకోర్టు డబుల్ బెంచ్ విచారణ నవంబర్ 3 కు వాయిదా

02



బటన్ నొక్కడం కాదు

## ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం

- పెన్షన్ల కోసం క్యూలైన్ల బాధలు తొలగించామని వెల్లడి
- మొగల్తూరులో చంద్రబాబు

02




## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసిన సీజే ధర్మాసనం

**హైదరాబాద్, మహా :** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ రెండు పథకాలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం ఎత్తివేసింది. ఈ పథకాల అమలుపై హైకోర్టు సింగిల్ ధర్మాసనం విధించిన స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర సర్కార్.. డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయగా మంగళవారం విచారణ జరిగింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల

మిగతా 3వ పేజీలో



# మంత్రివర్గంపై మంత్రాంగం

### కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం

- కొండా సురేఖ అంశంతో పాటు నేతల మధ్య గంటకు పైగా చర్చ
- నేడు కేసీ తో మీనాక్షి, మహేష్ గౌడ్ భేటీ..
- ఢిల్లీలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల, కొండా, స్పీకర్ ప్రసాదరావు



**ఢిల్లీ, మహా :** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. కేసీ వేణుగోపాల్‌తో గంటకుపైగా రేవంత్‌రెడ్డి సమావేశం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై చర్చించారు. అలాగే రాష్ట్రంలో ఇటీవల జరిగిన పరిణామాలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరిగినట్లు తెలుస్తోంది. తాజా రాజకీయ పరిణామాలపై కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశంపై, మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించారు. మరోవైపు మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ అధిష్ఠానం ఢిల్లీకి పిలిచడంతో ఆమె హుటాహుటిన ఢిల్లీ వెళ్లారు. తెలంగాణ కాంగ్రెస్ అగ్రనేతలు సైతం ఢిల్లీకి చేరుకున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం ఉదయం ఢిల్లీకి చేరుకోనున్నారు. కొండా సురేఖపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరింత క్రమశిక్షణ రాహిత్యం పెరిగే ప్రమాదం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. కొండా సురేఖపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పీసీసీ క్రమశిక్షణ కమిటీ

మిగతా 2వ పేజీలో



# తెలంగాణాలో మరో కొత్త ఎయిర్ పోర్ట్

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటుకు నిర్ణయం
- ప్రకటించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- 7 న భద్రాద్రిలో పర్యటించనున్న కేంద్ర సాంకేతిక బృందం

**న్యూఢిల్లీ, మహా :** తెలంగాణలో మరో విమానాశ్రయం నిర్మాణానికి కేంద్రం సిద్ధమవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్త ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం తప్పకుండా విమానాశ్రయం నిర్మించాలని అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఎయిర్ పోర్ట్ స్థల పరిశీలనకు త్వరలోనే కేంద్ర బృందం రానున్నదని తెలిపారు. ఈ మేరకు నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుందని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రితో భేటీ అయి, గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో అనుకూలం కాకపోవడంతో కొత్తగా గుర్తించిన స్థలాల వివరాలు తెలిపారు. నివేదిక అనుకూలంగా వస్తే కేంద్ర ప్రభుత్వం తదుపరి చర్యలు కొత్త స్థలాల్లో భౌగోళిక, వాతావరణ పరిస్థితులు, విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక అంశాలను బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. వారి నివేదిక అనుకూలంగా వస్తే కేంద్ర ప్రభుత్వం తదుపరి చర్యలు చేపడుతుందని

మిగతా 2వ పేజీలో



## బంగారం కొనొద్దు

03

- విదేశాల్లో పెళ్లిళ్లు వద్దు
- దేశ ప్రజలకు మోదీ పిలుపు

# సమాచార శాఖలో పదోన్నతులు

- అదనపు డైరెక్టర్‌గా డి.ఎస్. జగన్
- జాయింట్ డైరెక్టర్‌గా మధుసూదన్

**హైదరాబాద్, మహా :** సమాచార పౌర సంబంధాల శాఖలో పదోన్నతుల ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శాఖలోని వివిధ క్యాడర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా డి.ఎస్. జగన్‌ను అదనపు డైరెక్టర్‌గా, మధుసూదన్‌ను జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా పదోన్నతులతో శాఖలో దీర్ఘకాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న అధికారులు, ఉద్యోగుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. పైస్థాయి పోస్టుల్లో పదోన్నతులు కల్పించడంతో తదుపరి క్యాడర్లలో ఖాళీల భర్తీకి కూడా మార్గం సుగమం కావడంతో శాఖలో పదోన్నతుల పరంపర కొనసాగేందుకు అనుకూల వాతావరణం ఏర్పడింది.

**డీఆర్సీ ప్రక్రియ పూర్తి..**

**మంత్రి ఆమోదంతో ఉత్తర్వులు**

శాఖలోని వివిధ క్యాడర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతుల

మిగితా 3వ పేజీలో



# హైదరాబాద్‌లో నిమజ్జనం ఫైట్

- హైదరాబాద్‌లో నిమజ్జనం ఫైట్
- హైడ్రా వర్సెస్ గణేశ్ ఉత్సవ సమితి
- నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదు

02








## హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు

02

- భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే ఏర్పాటు
- గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వ చర్యలు
- హార్వర్డ్ వర్సిటీ సైతం కోర్సులు అందించేందుకు ఆసక్తి
- సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ఫలితంగా కుదిరిన ఒప్పందాలు

## హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో ఓవర్‌ఫ్లో!

- అమ్మకాలు లేకున్నా అడ్డగోలు రేట్లు
- తగ్గేదెలే అంటున్న బిల్డర్లు
- ఇప్పటికే కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న 3 లక్షల ఇళ్లు




- ఇంకా భారీగా నిర్మాణ దశలో ప్రాజెక్టులు.
- మధ్యతరగతిని పట్టించుకోకుండా లగ్జరీ ఇళ్ల నిర్మాణం
- ఇన్వెంటరీ పేరుకుపోతున్నా ధరలు తగ్గించేందుకు సిద్ధంగా లేని బిల్డర్లు
- రాబోయే రెండేళ్లు.. గృహ మార్కెట్‌కు కీలక పరీక్ష

02



# మంత్రివర్గంపై మంత్రాంగం

( మొదటి పేజీ తరువాయి )



సిఫారసు చేసింది. బీసీ మహిళపై వేటు వేస్తే పార్టీకి వచ్చే నష్టంపైన కాంగ్రెస్ హై కమాండ్ బేరీజు వేస్తోంది. కొండా సురేఖ వివరణ తీసుకుని నివేదికను కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రాహుల్ గాంధీకి కేసీ వేణుగోపాల్ అందజేయనున్నారు. ఆ తర్వాత కొండా సురేఖపై నిర్ణయాన్ని ఏఐసీసీ ప్రకటించనుంది. పునర్వ్యవస్థీకరణపై నిర్ణయం తీసుకుంటారా? లేక కొండాపై చర్యలతో సరి అంటారా చూడాల్సి ఉంది. అయితే మొత్తం మంత్రివర్గ ప్రక్షాళన జరగాలని, సీనియర్ మంత్రుల శాఖలన్నీ మారాలని, రెవెన్యూ, ఫైనాన్స్, ఇరిగేషన్ వంటి కీలక శాఖల్లో మార్పులు జరగవచ్చన్న ప్రచారముంది.

**ఢిల్లీలో నేతల మకాం**

ఢిల్లీలో కొండా సురేఖతో పాటు మంత్రులు ఉత్తమ్, తుమ్మల, స్పీకర్ ప్రసాద్ కుమార్ కూడా ఉన్నారు. బుధవారం మరికొందరు నేతలు ఢిల్లీకి చేరుకోనున్నారు. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై అధిష్ఠానంతో నేతలు చర్చించి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కీలకనేతలంతా ఢిల్లీలో మకాం వేయడంతో హైటెన్షన్ నెలకొంది. మంత్రులు, మంత్రుల కుటుంబసభ్యులే ఆరోపణలు చేసినపుడు అసెంబ్లీలో ప్రతిపక్షాలకు సమాధానం చెప్పే పరిస్థితి ఉండదని నేతలు ఉండగా, కేసీఆర్ కుటుంబాన్ని కూడా మరికొందరు నేతలు ప్రస్తావిస్తున్నారు. పార్టీ క్రమశిక్షణ కట్టుతప్పవద్దని అందరూ కోరుకుంటున్నారు.

# తెలంగాణాలో మరో కొత్త ఎయిర్ పోర్ట్

( మొదటి పేజీ తరువాయి )

తెలిపారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సాంకేతిక బృందాన్ని పంపించేందుకు చొరవ తీసుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ తీర్థ యాత్రికులకే కాదు ప్రాంత అభివృద్ధికి కీలకం ఈ ప్రాజెక్టు భద్రాచలం తీర్థయాత్రికులు, స్థానిక ప్రజలకు గొప్ప ఉపయోగం చేకూర్చనుంది.సింగరేణి పారిశ్రామిక ప్రాంతంతో పాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం రామాలయం సందర్శనకు వచ్చే భక్తులకు, వ్యాపారవేత్తలకు ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఎంతో మేలు జరుగుతుంది. రవాణా సౌకర్యాలు మెరుగై, ఈ ప్రాంత సమగ్ర ఆర్థిక పురోగతికి బాటలు పడతాయని భావిస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ఎయిర్ పోర్ట్ ల నిర్మాణానికి కేంద్రం నుండి సహకారం లభిస్తోంది, ఇప్పటికే వరంగల్ మామునూరు ఎయిర్పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ పూర్తి చేసి ఏవియేషన్ అథారిటీకి అప్పగించగా, కాకతీయ థీమ్‌తో టెర్మినల్ నిర్మాణం చేపట్టి త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

# హైదరాబాద్‌లో నిమజ్జనం ఫైట్

- **హైడ్రా వర్సెస్ గణేశ్ ఉత్సవ సమితి**
- **నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదు**

**హైదరాబాద్, మహా :** వివాదాలు అలవాటైన హైడ్రా.. మరో వివాదంలో చిక్కుకుంది. హైదరాబాద్‌లో వినాయక చవితి పండుగ సమీపిస్తున్న తరుణంలో విగ్రహాల నిమజ్జనంపై మరోసారి వివాదం నెలకొంది. తాము పునరుద్ధరించిన చెరువుల్లో విగ్రహాల నిమజ్జనాన్ని అనుమతించబోమని హైడ్రా స్పష్టం చేయడంతో ఈ వివాదం రాజుకుంది. ఈ నిర్ణయాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. హైడ్రా ప్రకటనపై గణేశ్ ఉత్సవ సమితి ఘాటుగా స్పందించింది. విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదని సమితి స్పష్టం చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అడ్డుకోవాలని చూడటం తగదని, ప్రతి ఏటా మాదిరిగానే నగరంలోని అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం నిర్వహించి తీరుతామని ఉద్ఘాటించింది. హిందూ పండుగలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని ఉత్సవ సమితి పేర్కొంది. విగ్రహ నిమజ్జనం వల్ల చెరువులు కలుషితమవుతున్నాయనడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వాదించింది. ఇరుపక్షాల మధ్య నెలకొన్న ఈ భిన్న వాదనలతో స్థానిక చెరువుల్లో నిమజ్జనంపై గందరగోళం నెలకొంది.

# వచ్చే ఏడాది ఏఐ 'సూపర్‌హ్యూమన్ మస్క్ సంచలన ప్రకటన

**మహా :** ప్రముఖ టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ ఏఐ భవిష్యత్తుపై సంచలన ప్రకటన చేశారు. వచ్చే ఏడాది (2027) చివరి నాటికి ఏఐ సాంకేతికత డిజిటల్ ప్రపంచంలో మానవ సామర్థ్యాలను పూర్తిగా మించిపోతుందని, దాదాపు ఏ డిజిటల్ పనైనా 'సూపర్‌హ్యూమన్' స్థాయిలో నిర్వహించగలదని ఆయన స్పష్టం చేశారు. వెర్సెల్ సీఈఓ గ్విలెర్మో రాచ్ ఎక్స్ వేదికగా ఏఐ ఏజెంట్ల సామర్థ్యాలపై చేసిన పోస్ట్‌కు స్పందిస్తూ మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. భౌతిక వస్తువులను షేపింగ్ చేయడం మినహా కోడింగ్, రీసెర్చ్, సైబర్ సెక్యూరిటీ, చట్టపరమైన పనులు, డిజిటల్ కంటెంట్ సృష్టి.. వంటి ఏ రంగంలోనైనా ఏఐ మానవుల కంటే అద్భుతంగా పనిచేయగలదని మస్క్ వెల్లడించారు. అయితే భౌతిక శ్రమ, రోబోటిక్స్ రంగం మాత్రం డిజిటల్ పురోగతితో పోలిస్తే కొంత నెమ్మదిగా సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఇదే సందర్భంలో దశాబ్దం క్రితమే గూగుల్ సహ వ్యవస్థాపకుడు లారీ పేజ్, ఏఐ భవిష్యత్తులో హ్యాకింగ్, సిస్టమ్ సెక్యూరిటీ ఉల్లంఘనల్లో మనుషుల కంటే అత్యుత్తమంగా రాణిస్తుందని జోస్యం చెప్పినట్లు మస్క్ గుర్తుచేశారు. మస్క్ తాజా అంచనాలు నాలెడ్జ్‌వర్క్ పరిశ్రమల్లో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంతో పాటు ఉద్యోగ భద్రత, సైబర్ సెక్యూరిటీ, ఏఐ పర్యవేక్షణపై తీవ్రమైన చర్చకు దారితీశాయి.

# బటన్ నొక్కడం కాదు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం

**మొగల్తూరులో చంద్రబాబు**



**మొగల్తూరు, మహా :** "గత పాలకులు బటన్ నొక్కి చేతులు దులుపుకొన్నారు, రోడ్ల నిండా గుంతలు పెట్టారు. కానీ మేం అలా కాదు.. ప్రతి అవ్వాతాత ఇంటికి వచ్చి వారికి గౌరవంగా పెన్షన్ అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు సూత్రాలతో ముందుకు సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గంలోని మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన 'పేదల సేవలో ప్రజా వేదిక' కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికిందని చంద్రబాబు అన్నారు. వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేసిన గత పాలకుల తీరును ఆయన తప్పుబట్టారు. ఇప్పుడు తాము నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి, పెంచిన పెన్షన్లను అందిస్తూ వారి ఆత్మగౌరవాన్ని నిలబెడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు, 31 ఏళ్ల క్రితం ఇదే రోజు (సెప్టెంబరు 1) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేశానని, అప్పటి నుంచి ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యమే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు. ఇప్పటివరకు పెన్షన్ల రూపంలో రూ.73,507 కోట్లు అందించామని, గత రెండేళ్లలో సంక్షేమ పథకాల కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో ఓవర్‌ఫ్లో!



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో ఇళ్ల సరఫరా పెరుగుతున్న వేగానికి అనుగుణంగా కొనుగోలు శక్తి పెరగడం లేదు. ఇప్పటికే అమ్ముడుకాని గృహాల నిల్వ గణనీయంగా ఉండగా.. కొత్తగా వేలాది ఇళ్లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. అయినప్పటికీ ధరలు తగ్గే సూచనలు కనిపించడం లేదు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబానికి అందుబాటులో ఉండే ఇళ్ల కంటే కోటి రూపాయలు, రెండు కోట్లు, అంతకుమించి ధర కలిగిన గృహాల నిర్మాణానికే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. దీంతో హైదరాబాద్ గృహ మార్కెట్‌లో సరఫరా ఉంది.. అవసరం ఉంది.. కానీ అందుబాటు ధరలో ఇల్లు మాత్రం అరుదవుతోంది. అమ్మకాలు లేకున్నా తగ్గేదెలే అంటున్న బిల్డర్లు. హైదరాబాద్‌లో ఇప్పటికే మూడు లక్షల ఇళ్లు అమ్ముడుకాకుండా ఉన్నాయన్న ప్రచారం ఇటీవల బలంగా వినిపిస్తోంది. 2026 తొలి ఆరు నెలల గణాంకాల ప్రకారం నగరంలో అమ్ముడుకాని నివాస గృహాల సంఖ్య 2,06,095గా ఉన్నట్లు తాజా పరిశోధన నివేదికలు చెబుతున్నాయి. నిర్మాణంలో ఉన్నవి, కొత్తగా ప్రారంభమైనవి, విక్రయానికి అందుబాటులో ఉన్నవి వంటి వివిధ దశలను కలిపి లెక్కిస్తే గృహాల మొత్తం నిల్వ మరింత ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే ఉన్న ఇళ్లు పూర్తిగా అమ్ముడయ్యేలోపే కొత్తగా నిర్మించిన ఇళ్లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే నిర్మాణ సంస్థలపై అమ్మకపు ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉంది.

**అమ్మకాల కంటే కొత్త ఇళ్లే ఎక్కువ**

2026 జనవరి నుంచి జూన్ వరకు హైదరాబాద్‌లో 19,249 నివాస గృహాలు విక్రయమైనట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాల్లో పెరుగుదల చాలా స్వల్పంగానే ఉంది. అదే సమయంలో 40,466 కొత్త నివాస గృహాలు మార్కెట్‌లోకి వచ్చాయి. అంటే అమ్ముడైన ఇళ్ల కంటే కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఇళ్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇప్పటికే ఉన్న నిల్వ తగ్గకముందే కొత్త సరఫరా చేరుతుండటంతో మార్కెట్‌లో ఇళ్ల నిల్వ క్రమంగా పెరుగుతోంది. నిర్మాణంలో ఉన్న భారీ ప్రాజెక్టులు కూడా రాబోయే నెలల్లో పూర్తయి అమ్మకానికి వస్తే ఈ ఒత్తిడి మరింత పెరగవచ్చు. ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు, సమాచార సాంకేతిక రంగం, ఔషధ పరిశ్రమ, ఆర్థిక సేవలు, అంతర్జాతీయ సంస్థల కార్యకలాపాల కారణంగా నగరంలో నివాస అవసరం కొనసాగుతూనే ఉంది. సమస్య ఇళ్ల అవసరం లేకపోవడం కాదు.. అందుబాటులో ఉన్న ధరలకు ఇళ్లు లేకపోవడమే.

చదరపు అడుగు ధర పైపైకి.. కొనుగోలు శక్తి కిందకు అమ్ముడుకాని ఇళ్ల నిల్వ పెరుగుతున్నప్పటికీ హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు మాత్రం తగ్గడం లేదు. 2026 తొలి ఆరు నెలల్లో నగర నివాస గృహాల సగటు చదరపు అడుగు ధర రూ.8,258కు చేరినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ధరలు మరింత పెరిగాయి. భూముల విలువలు పెరగడం, నిర్మాణ సామగ్రి ధరలు అధికంగా ఉండటం, కార్మిక వ్యయం, రుణాలపై వడ్డీ భారం, అనుమతులు, పన్నులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అయ్యే వ్యయం పెరగడం వంటి కారణాలతో నిర్మాణ సంస్థలు ధరలను తగ్గించడానికి వెనుకాడుతున్నాయి. ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లో భూముల ధరలు భారీగా పెరగడంతో అక్కడ నిర్మించే ఇళ్ల ధరలు కూడా సహజంగానే పెరుగుతున్నాయి. అయితే కుటుంబాల ఆదాయం అదే వేగంతో పెరగకపోవడంతో కొనుగోలుదారుడి సామర్థ్యానికి, ఇళ్ల ధరలకు మధ్య అంతరం పెరుగుతోంది. ఇంటి ధర పెరుగుతోంది.. కానీ దాన్ని కొనుగోలు చేసే కుటుంబం చేతిలో మిగిలే ఆదాయం మాత్రం పెరగడం లేదు. ఈ వ్యత్యాసమే మార్కెట్‌కు భవిష్యత్తులో అతిపెద్ద సవాలుగా మారవచ్చు.

**మధ్యతరగతి కోసం ఇళ్లు ఎక్కడ?**

హైదరాబాద్ గృహ మార్కెట్‌లో ప్రస్తుతం అత్యంత ఆందోళన కలిగిస్తున్న అంశం మధ్యతరగతి కుటుంబానికి అందుబాటులో ఉండే ఇళ్ల కొరత. రూ.50 లక్షల లోపు ధర కలిగిన ఇళ్ల అమ్మకాల వాటా కేవలం మూడు శాతానికి పడిపోయింది. రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య ధరల ఇళ్ల వాటా కూడా తగ్గుతోంది. మరోవైపు రూ.కోటి నుంచి రూ.రెండు కోట్ల మధ్య ధరలున్న ఇళ్ల అమ్మకాల వాటా గణనీయంగా పెరిగింది. రూ.రెండు కోట్ల నుంచి రూ.ఐదు కోట్ల వరకు ఉన్న ఇళ్లకు కూడా మార్కెట్‌లో స్థానం పెరుగుతోంది. దీని వెనుక అధిక ఆదాయం కలిగిన వర్గాల కొనుగోలు శక్తి పెరగడం ఒక కారణం కాగా.. నిర్మాణ సంస్థలు అధిక లాభాల కోసం ఖరీదైన గృహాల నిర్మాణాన్ని ఎంచుకోవడం మరో కారణం. ఫలితంగా సాధారణ ఉద్యోగి, మధ్యతరగతి కుటుంబం తన ఆదాయానికి సరిపోయే ఇంటి కోసం నగరానికి మరింత దూరం వెళ్లాల్సి వస్తోంది. అక్కడ ఇల్లు కొంత చౌకగా దొరికినా కార్యాలయానికి ప్రయాణ ఖర్చు, సమయం, పిల్లల విద్య, వైద్యం వంటి ఇతర ఖర్చులు పెరుగుతున్నాయి. ఇల్లు చౌకగా దొరికినా.. అక్కడ జీవించడం ఖరీదవుతున్న పరిస్థితి ఏర్పడుతోంది.

**పశ్చిమ హైదరాబాద్‌లో నిర్మాణాల వెల్లువ**

హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో పశ్చిమ ప్రాంతం ప్రధాన కేంద్రంగా మారింది. గచ్చిబౌలి, ఆర్థిక జిల్లా, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, తెల్లాపూర్, కొల్లూరు ప్రాంతాల్లో భారీ నివాస సముదాయాలు నిర్మితమవుతున్నాయి. సమాచార సాంకేతిక సంస్థలు, అంతర్జాతీయ కార్యాలయాలు, ఆర్థిక సేవా సంస్థలు, ఔషధ పరిశ్రమల విస్తరణతో ఈ ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలు పెరిగాయి. రహదారి సౌకర్యాలు, విమానాశ్రయానికి అనుసంధానం, బయటి వలయ రహదారి వంటి మౌలిక వసతులు భూముల విలువలను మరింత పెంచాయి. ఇదే సమయంలో భారీ స్థాయిలో గృహ నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. 2026 రెండో త్రైమాసికంలో హైదరాబాద్‌లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన నివాస గృహాల్లో పశ్చిమ ప్రాంతం వాటా 72 శాతానికి పైగా ఉన్నట్లు తాజా గణాంకాలు సూచిస్తున్నాయి. ఒకే ప్రాంతంలో భారీగా ఇళ్లు నిర్మితమవుతున్న నేపథ్యంలో వాటిని కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్న కుటుంబాల సంఖ్యపై సహజంగానే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణాల వేగం పెరిగింది.. ఇప్పుడు అమ్మకాల వేగం కూడా అదే స్థాయిలో పెరగాల్సిన అవసరం ఉంది.

**ధర తగ్గించని నిర్మాణ సంస్థలు**

అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేకపోయినా నిర్మాణ సంస్థలు నేరుగా ధర తగ్గించడానికి సిద్ధపడటం లేదు. దీనికి భూమి, నిర్మాణ వ్యయం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఒక ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాత ధర తగ్గిస్తే ఇప్పటికే ఇల్లు కొనుగోలు చేసిన వారి నుంచి అభ్యంతరాలు రావచ్చు. అంతేకాదు నిర్మాణ సంస్థల లాభదాయకత కూడా దెబ్బతినే అవకాశం ఉంది. అందుకే ధరను బహిరంగంగా తగ్గించకుండా వివిధ రకాల ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. వాహన నిలుపుదల స్థలం, ఇంటి అంతర్గత అలంకరణ, గృహోపకరణాలు, బంగారు నాణేలు, వాహనాలు, వాయిదా చెల్లింపుల్లో సడలింపులు వంటి ప్రయోజనాలతో కొనుగోలుదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. దీని వల్ల ప్రకటించిన ధరలో పెద్ద మార్పు కనిపించకపోయినా తుది ఒప్పందంలో కొనుగోలుదారుడికి కొంత ప్రయోజనం లభించే అవకాశం ఉంది. ఈ పరిణామం భవిష్యత్తులో మరింత పెరిగితే చదరపు అడుగు ధర కంటే తుది కొనుగోలు ధరే మార్కెట్‌కు అసలు కొలమానంగా మారే అవకాశం ఉంది.

**మారుతున్న మార్కెట్**

హైదరాబాద్ గృహ మార్కెట్ పూర్తిగా కుప్పకూలుతోందని చెప్పడానికి ప్రస్తుతం ఆధారాలు లేవు. నగర ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది ఉంది. సమాచార సాంకేతిక రంగం, ఔషధ పరిశ్రమ, ఆర్థిక సేవలు, అంతర్జాతీయ సంస్థల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కార్యాలయాల అవసరం పెరుగుతుండటంతో ఉద్యోగ అవకాశాలు కూడా కొనసాగుతున్నాయి. అందువల్ల నివాస గృహాలకు ప్రాథమిక డిమాండ్ భవిష్యత్తులోనూ ఉండే అవకాశం ఉంది. అయితే కొనుగోలుదారుడి స్వభావం మారుతోంది. గతంలో ధరలు మరింత పెరుగుతాయన్న అంచనాతో ముందుగానే ఇల్లు కొనుగోలు చేసే వారు ఉండేవారు. ఇప్పుడు మాత్రం కొనుగోలుదారుడు ఆచితూచి అడుగు వేస్తున్నాడు. ఇంటి ధర, రుణ భారం, నెలవారీ వాయిదా, నిర్మాణ నాణ్యత, ప్రాంత అభివృద్ధి, రవాణా సౌకర్యాలు, భవిష్యత్ విలువ వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటున్నాడు. అంటే కొనుగోలుదారుడు మార్కెట్‌ను విడిచిపెట్టలేదు.. తన షరతులపై కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నాడు.

**రాబోయే రెండేళ్లలో అసలు పరీక్ష**

ఇప్పటికే నిర్మాణంలో ఉన్న వేలాది ఇళ్లు వచ్చే ఏడాది, ఆ తరువాతి కాలంలో పూర్తయి మార్కెట్‌లోకి రావాల్సి ఉంది. అదే సమయంలో కొత్తగా ప్రారంభించే ప్రాజెక్టుల వేగం కొంత తగ్గుతున్న సంకేతాలు కూడా కనిపిస్తున్నాయి. ఇది నిర్మాణ సంస్థలు మార్కెట్‌లోని పరిస్థితిని గమనిస్తున్నాయన్న సూచనగా భావించవచ్చు. అమ్మకాలు ప్రస్తుత స్థాయిలో కొనసాగి.. కొత్తగా వచ్చే ఇళ్ల సంఖ్య తగ్గితే మార్కెట్ క్రమంగా సమతుల్యం కావచ్చు. కానీ నిర్మాణంలో ఉన్న భారీ ప్రాజెక్టులు ఒకేసారి పూర్తయి వేలాది ఇళ్లు అమ్మకానికి వస్తే నిల్వ మరింత పెరిగే అవకాశం ఉంది. అప్పుడు కొనుగోలుదారుడి బేరసార శక్తి పెరుగుతుంది. నిర్మాణ సంస్థలు ధరలు తగ్గించకపోయినా మరిన్ని రాయితీలు, ప్రత్యేక ప్రయోజనాలు ప్రకటించాల్సిన పరిస్థితి రావచ్చు. అందువల్ల హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌కు వచ్చే పన్నెండు నుంచి ఇరవై నాలుగు నెలలు అత్యంత కీలకం. చివరికి హైదరాబాద్ గృహ మార్కెట్‌ను నిర్ణయించేది ఎన్ని భవనాలు నిర్మించామన్నది కాదు.. ఎన్ని కుటుంబాలు వాటిని కొనుగోలు చేయగలిగాయన్నదే. నగరం వేగంగా అభివృద్ధి చెందడం ఆనందించాల్సిన విషయమే. కానీ నగర అభివృద్ధి ఫలితాలు మధ్యతరగతి కుటుంబానికి సొంతింటి రూపంలో అందకపోతే ఆ అభివృద్ధిలో ఒక కీలకమైన లోటు మిగిలిపోతుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇళ్ల కొరత కంటే అందుబాటు ధరల ఇళ్ల కొరతే పెద్ద సమస్యగా మారుతోంది. నిర్మాణ సంస్థలు అధిక ధరల

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు నితిన్ నబీన్ ఫోన్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్టు చేయడాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. ఈ అణచివేత చర్య కాంగ్రెస్ ప్రభుత్వ దివాలా కోరుతనానికి, నియంతృత్వ వైఖరికి అద్దం పడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడికి గురైన నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న రాంచందర్ రావును పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం అత్యంత హేయమని నితిన్ నబీన్ అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు భౌతిక దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నప్పుడు ప్రేక్షక పాత్ర వహించిన పోలీసు యంత్రాంగం... బాధితులకు అండగా నిలిచేందుకు వెళుతున్న ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పే మాటలన్నీ కేవలం ప్రజలను మభ్యపెట్టే నాటకాలని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ఈ దౌర్జన్యాలు, ప్రతిపక్షాలపై దాడులకు తెలంగాణ ప్రజలు రాబోయే రోజుల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతారని నితిన్ నబీన్ హెచ్చరించారు. రాంచందర్ రావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఆర్టీసీలో త్వరలో 1500 కండక్టర్ పోస్టుల భర్తీ

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

హైదరాబాద్, మహా : టీజీఎస్ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. అలాగే దాదాపు 4 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా చివరిదశలో ఉందని పేర్కొన్నారు. ఈ విధంగా రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలను పెంచడం ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు. రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని ఇప్పటి వరకు 347.36 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని అన్నారు. ఈ మేరకు రూ. 12,167 కోట్లు ఆదా చేసుకున్నారని తెలిపారు. ఇక కొత్తగా 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేశామని.. 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ నగరంలో కొత్తగా మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కబోతున్నాయని తెలిపారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

( మదటి పేజీ తరువాయి )

అమలుపై మధ్యంతర స్టే విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని వివరించారు. దీంతో, అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగించేందుకు మార్గం సుగమం అయింది.



### హైడ్రా ఛీఫ్ రంగనాథ్ కు ఊరట

# హైకోర్టు కీలక నిర్ణయం

**సింగిల్ జడ్జి తీర్పును తాత్కాలికంగా పక్కన పెట్టిన హైకోర్టు డబుల్ బెంచ్**

**విచారణ నవంబర్ 3 కు వాయిదా**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ లో అక్రమ కట్టడాల తొలగింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. తమ ఆదేశాలను పదే పదే ధిక్కరిస్తున్నారన్న కారణంతో పక్కన బెట్టాలని గతంలో హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది. గతంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు, కోర్టు ఇచ్చిన ఆదేశాలను ధిక్కరిస్తున్న తీరు ఆధారంగా హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి ఈ మేరకు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. అయితే వీటిపై రంగనాథ్ హైకోర్టు డివిజన్ బెంచ్ ను ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది.హైదరాబాద్ లోని శాంతా శ్రీరాం కన్ స్ట్రక్షన్స్ కేసులో హైడ్రా కమిషనర్ గా ఉన్న ఏవీ రంగనాథ్ ను ఆ పదవి నుంచి తప్పించి, మరొకరిని నియమించాలంటూ గతంలో హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ ఇవాళ తాత్కాలికంగా పక్కనబెట్టింది. దీంతో ప్రభుత్వం ఇప్పటికిప్పుడు కొత్త హైడ్రాఛీఫ్ కోసం వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ కేసులో తదుపరి విచారణను నవంబర్ 3కు వాయిదా వేస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. హైడ్రా ఛీఫ్ గా ఉన్న రంగనాథ్.. మల్కాజిగిరి మండలం లో తుకుంటలో కూల్చివేతలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ శాంతా శ్రీరాం కన్ స్ట్రక్షన్స్ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. గతంలో ఈ కూల్చివేతలకు వ్యతిరేకంగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆయన ధిక్కరించారంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి బెంచ్.. గతంలో రంగనాథ్ పదే పదే హైకోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించడాన్ని సీరియస్ గా తీసుకుంది. ముఖ్యంగా ఏడాదిన్నరలో 63 కోర్టు ధిక్కారణ పిటిషన్ లు ఆయనపై నమోదు కావడాన్ని తీవ్రంగా పరిగణించింది. దీంతో రంగనాథ్ ను తప్పించి మరో సమర్థుడైన అధికారిని హైడ్రా ఛీఫ్ గా నియమించాలని ప్రభుత్వానికి సూచించింది. దీనిపై హైకోర్టు డివిజన్ బెంచ్ లో రంగనాథ్ కు ఇవాళ ఊరట లభించింది.

## సుప్రీం సాక్షిగా కేంద్రంతో డీల్ ఓకే ..! కాక్రోచ్ జనతా పార్టీ కీలక నిర్ణయం..!

**ఢిల్లీ, మహా :** నీట్ అక్రమాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ జూలై 20న ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ.. ఎట్టకేలకు తమ పంతం నెగ్గించుకుంది. అయితే ఢిల్లీ ఆందోళనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లను తొలగిస్తామని కేంద్రం ఇచ్చిన హామీ మాత్రం నిలబెట్టుకోలేదు. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ ఈ నెల 5న ఇండియా గేట్ వద్ద మరో విడత నిరసనలకు పిలుపునిచ్చింది. దీంతో కేంద్రం అలర్ట్ అయింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. గతంలో విద్యార్థులపై ఢిల్లీ సహా వివిధ రాష్ట్రాల్లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లను తొలగించే విషయంలో కేంద్రం నిర్లిప్తతను తప్పుబడుతూ సెప్టెంబర్ 5న ఇండియా గేట్ వద్ద సీజేపీ నిరసనలకు పిలుపునిచ్చింది. దీంతో కేంద్రం సుప్రీంకోర్టుకు నిన్న కీలక సూచన చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం తమకు లభించే విశేషాధికారాల్ని వినియోగించి విద్యార్థులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్ ల రద్దుకు ఆదేశాలు ఇవ్వాలని కోరింది. ఈ మేరకు పిటిషన్ కూడా దాఖలు చేసింది. అనంతరం కేంద్రం బాటలోనే మరో నాలుగు బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఇలాగే సుప్రీంకోర్టులో పిటిషన్ల దాఖలుకు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో జూలై 20 జంతర్ మంతర్ ఆందోళనకు సంబంధించి దాఖలైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవడంతో సహా, నిరసనకారులకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటామని కేంద్రం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. దీంతో సెప్టెంబర్ 5న ఢిల్లీలో మరో ఆందోళన నిర్వహించాలన్న తమ పిలుపును ఉపసంహరించుకుంటున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీజేపీ అధికార ప్రతినిధి, సహకన్వీనర్ సౌరవ్ దాస్ ఈ ప్రకటన చేశారు. సీజేపీ నిర్ణయంపై సీజేఐ కూడా సానుకూలంగా స్పందించారు. ఇరుపక్షాలు సత్సంబంధాలు ప్రదర్శిస్తే, అన్ని సమస్యలను పరిష్కరించవచ్చని స్పష్టం చేశారు. దీంతో కేంద్రం కోరినట్లుగా సుప్రీంకోర్టు కూడా విద్యార్థులపై ఎఫ్ఐఆర్ ల రద్దుకు ఆదేశాలు ఇచ్చింది. మరోవైపు నీట్ మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపుపై మూడు నెలల్లో మార్గదర్శకాలు ఇస్తామని సుప్రీంకు కేంద్రం హామీ ఇచ్చింది.



# కమీషన్ల కోసమే ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో జాప్యం

**బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి**

- 8 ఏళ్లలో 47 పిల్లర్లే పూర్తి.. ఇంకా 92 పిల్లర్లు పెండింగ్
- పనులు వేగవంతం చేయకపోతే ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో భారీ ధర్నా



**మహా, మేడ్చల్:** మేడ్చల్ నియోజకవర్గంలోని పీర్జాది గూడ పరిధిలో కొనసాగుతున్న ఉప్పల్ -సీపీఆర్ఐ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి శనివారం ఆర్అండ్‌బీ శాఖ డీఈ సరితతో పాటు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, ట్రాఫిక్ సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడిన ఏనుగు సుదర్శన్ రెడ్డి, ఎలివేటెడ్ కారిడార్ మార్గంలో ప్రతిరోజూ లక్షకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. ఈ కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.2018లో ఉప్పల్ నుంచి సీపీఆర్ఐ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును తమ ఆధ్వర్యంలో చేపట్టి ఆర్అండ్‌బీ శాఖ ద్వారా పనులు కొనసాగించిందన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అలసత్వం, అప్పటి మంత్రి మల్లారెడ్డి అసమర్థత, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ఆశించిన వేగంతో సాగలేదని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శించారు.రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని గతంలో ప్రకటించినప్పటికీ, ఆ హామీ అమలులో కనిపించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో గాయత్రి కన్‌స్ట్రక్షన్స్‌ను తొలగించిన తర్వాత తిరిగి అదే సంస్థకు పనులు అప్పగించడం వెనుక కమిషన్ల వ్యవహారం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు.ఎనిమిదేళ్ల కాలంలో కేవలం 47 పిల్లర్లు మాత్రమే పూర్తయ్యాయని, ఇంకా 92 పిల్లర్లు నిర్మించాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం నెలకు సగటున మూడు పిల్లర్ల చొప్పున పనులు జరుగుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే మిగిలిన పనులు పూర్తికావడానికి మరో నాలుగేళ్లకు పైగా సమయం పట్టే అవకాశం ఉందన్నారు.పనుల జాప్యంపై అధికారులను ప్రశ్నిస్తే ట్రాఫిక్ పోలీసు శాఖ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, విద్యుత్ శాఖల నుంచి తగిన సహకారం అందడం లేదని చెబుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రోడ్డు నిర్మాణం కోసం రూ.30 కోట్ల నిధులు విడుదల చేసినప్పటికీ, పనులు పూర్తి చేయకపోవడం దురదృష్టకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు హామీలు ఇచ్చి కాలయాపన చేస్తున్నాయని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని సుదర్శన్ రెడ్డి అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను వెల్లడించి ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు.లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ నేతృత్వంలో భారీ స్థాయిలో ప్రజా ఉద్యమం చేపట్టి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జైపాల్ రెడ్డి, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, రాష్ట్ర నాయకులు రాము యాదవ్, జమ్ముల ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర యువమోర్చా నాయకులు పవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు స్వరూప్, బాల్‌రెడ్డి, మహిళా మోర్చా నాయకులు సుజాత రెడ్డి, స్వప్న, చంద్రశేఖర్ గుప్తా, సుధాకర్ చారి, వెంకట్ రెడ్డి, మల్లారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పన్నుల వసూళ్లలో అలసత్వం సహించేది లేదు

- వసూళ్ల పురోగతి పై కమిషనర్ ఆగ్రహం
- సూచించిన లక్ష్యాలు చేరుకోకపోతే కఠిన చర్యలు

**వరంగల్, కార్పొరేషన్ మహా :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం పై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి .వెంకన్న తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహించే సిబ్బంది పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాల లోని అలుమిని ఆడిటోరియంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన పన్నుల వసూళ్ల సమీక్ష సమావేశంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా ఆస్తిపన్ను వసూళ్ల పురోగతిని సూక్ష్మస్థాయిలో సమీక్షించి, తక్కువ వసూళ్లు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేసి బల్దియా ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్ నిర్వహించాలి**

ప్రతి రోజు ఉదయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వసూళ్ల పురోగతిని సమీక్షించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతిరోజూ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా కార్యాచరణ రూపొందించుకుని క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పన్నులు వసూలు చేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షించాలన్నారు. పక్షం రోజుల్లో మరోసారి సమీక్ష నిర్వహిస్తానని, అప్పటికి వసూళ్లలో గణనీయమైన పురోగతి కనిపించని బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

**నీటి పన్ను బకాయిల పై ప్రత్యేక దృష్టి**

ఆస్తి పన్నుతో పాటు నీటి పన్ను వసూళ్లను కూడా సమాంతరంగా చేపట్టాలని టి.వెంకన్న సూచించారు. నగరంలోని 66 డివిజన్లలో నీటి పన్ను బకాయిలు పేరుకుపోయిన నేపథ్యంలో, వాటిని మార్చి 31లోగా పూర్తిస్థాయిలో వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

కొత్త అసెస్‌మెంట్లతో పాటు రివైజ్డ్ అసెస్‌మెంట్లను చేపట్టి పన్ను ఆదాయాన్ని పెంచే అవకాశాలను గుర్తించాలని సూచించారు. బల్దియా ఆదాయాన్ని పెంచడంలో రెవెన్యూ విభాగం కీలక పాత్ర పోషించాలని అన్నారు.

**ప్రతి నెలా స్పష్టమైన టార్గెటే లక్ష్యం**

వచ్చే మార్చి 31లోగా నిర్దేశించిన వార్షిక వసూళ్ల లక్ష్యాన్ని సాధించేలా ప్రతి నెలకు స్పష్టమైన టార్గెట్ నిర్దేశించుకుని ముందుకు సాగాలని కమిషనర్ ఆదేశించారు. లక్ష్య సాధనలో వెనుకబడిన సిబ్బందిని గుర్తించి కారణాలను విశ్లేషించి, వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు.

నగర ప్రజలు తమ ఆస్తిపన్ను, నీటి పన్నులను సకాలంలో చెల్లించి బల్దియా అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న, రామకృష్ణ,ఐటీ మేనేజర్ రమేష్ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.








# జాతీయ గ్రాప్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాలుడి సత్తా..!

**రెండోసారి గోల్డ్ మెడల్ సాధించిన ధృవన్ సత్యవర్మ..!**

**మహా, క్రీడా విభాగం హైదరాబాద్:** చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో వరుస విజయాలు సాధిస్తూ తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తున్న యువ క్రీడాకారుడు మాస్టర్ ధృవన్ సత్యవర్మ మరోసారి స్వర్ణ పతకం సాధించాడు. గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియంలో కోచ్ సుధాకర్ యాదవ్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న ధృవన్, నేషనల్ గ్రాప్లింగ్ (రెజ్లింగ్) ఛాంపియన్‌షిప్-2026లో అండర్13 బాలుర 38 కిలోల విభాగంలో తెలంగాణ తరపున పోటీ పడి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు.ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్ జిల్లా రోష్నాబాద్‌లో ఉన్న వందనా కటారియా స్పోర్ట్స్ స్టేడియంలో ఆగస్టు 21 నుంచి 23 వరకు నిర్వహించిన ఈ జాతీయ స్థాయి పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కఠిన పోటీ నెలకొన్న ఈ టోర్నమెంట్‌లో ధృవన్ తన ప్రతిభను చాటుకున్నాడు.తన విభాగంలో ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతో తలపడిన ధృవన్, జి ఐ, నోజి విభాగాల్లో కలిపి మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడి విజయాలను నమోదు చేశాడు. చురుకుదనం, సాంకేతిక నైపుణ్యం, పట్టుదలతో ప్రత్యర్థులను అధిగమించి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు.గ్రాప్లింగ్ కమిటీ ఆఫ్ ఇండియా



(జీసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ధృవన్‌కు ఇది రెండో స్వర్ణ పతకం కావడం విశేషం. వరుసగా రెండోసారి జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం ద్వారా తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నాడు.కోచ్ సుధాకర్ యాదవ్ మార్గదర్శకత్వంలో కఠిన సాధన కొనసాగిస్తున్న ధృవన్, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. అతని విజయం తల్లిదండ్రులు, కోచ్,



గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియం క్రీడా కుటుంబంతో పాటు తెలంగాణ క్రీడాభిమానులకు ఆనందాన్ని కలిగించింది."మెడల్ చేతిలో కనిపిస్తుంది.. కానీ దాని వెనుక కనిపించని కష్టం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటాయి" అనే మాటలను ధృవన్ తన విజయాలతో నిజం చేస్తున్నాడని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అతడి విజయ ప్రస్థానం భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పతకాలకు నాంది కావాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# సమాచార శాఖలో పదోన్నతులు

( మొదటి పేజీ తరువాయి )

ద్వారా భర్తీ చేసేందుకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ ప్రక్రియను పూర్తి చేసింది. అనంతరం పదోన్నతులకు సంబంధించిన ఫైల్ శాఖ మంత్రి ఆమోదం కోసం పంపబడింది. మంత్రి ఆమోదం లభించడంతో తాజాగా ప్రభుత్వం పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శాఖలో పదోన్నతుల ప్రక్రియకు అధికారికంగా శ్రీకారం చుట్టినట్లయింది. అదనపు డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ స్థాయిలో పదోన్నతులు కల్పించడంతో తదుపరి క్యాడర్లలో ఖాళీలు ఏర్పడి, వాటిని నిబంధనల ప్రకారం పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా డిప్యూటీ డైరెక్టర్ పోస్టులతో పాటు కింది స్థాయి క్యాడర్లలోనూ పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగేందుకు తాజా ఉత్తర్వులు దోహదపడనున్నాయి. దీంతో పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు వివిధ క్యాడర్లలో పదోన్నతులకు మార్గం సుగమమవుతుందని శాఖ అధికారులు, ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదనపు డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన డి.ఎస్. జగన్, జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన మధుసూదన్‌కు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



**28 ఏళ్ల సర్వీసు ఉన్న అధికారులకు ఆశలు**

సమాచార పౌర సంబంధాల శాఖలో దాదాపు 28 సంవత్సరాలుగా సేవలందిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులు సైతం తదుపరి పదోన్నతుల కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. వివిధ క్యాడర్లలో పదోన్నతులు పరస్పరం అనుసంధానమై ఉండటంతో పైస్థాయి పదోన్నతులు పూర్తయితే తదుపరి స్థాయిల్లోనూ ప్రమోషన్లకు అవకాశం ఏర్పడుతుంది. తాజా పదోన్నతులతో ఈ ప్రక్రియకు అవసరమైన కదలిక ప్రారంభమైంది.

**ఉద్యోగుల విజ్ఞప్తులకు సానుకూల స్పందన**

శాఖలో పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులు, ఉద్యోగులు పలుమార్లు ఉన్నతాధికారులను, శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తులు చేశారు. వారి విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం తాజాగా పదోన్నతులు కల్పించడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతుల కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగులకు తాజా నిర్ణయం కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని, ఇక మిగిలిన క్యాడర్లలోనూ పదోన్నతుల ప్రక్రియ వేగంగా కొనసాగుతుందన్న నమ్మకం ఏర్పడిందని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

# బంగారం కొనొద్దు

- విదేశాల్లో పెళ్లిళ్లు వద్దు
- దేశ ప్రజలకు మోదీ పిలుపు

**ఢిల్లీ, మహా :** భారత ఆర్థికవ్యవస్థ జూన్ త్రైమాసికంలో ఊహించిన దానికంటే అత్యంత బలమైన వృద్ధిని సాధించిన వేళ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విడుదల చేసిన సెల్ఫీ వీడియో సందేశం సంచలనంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా రష్యాఉక్రెయిన్, పశ్చిమాసియా యుద్ధాలు, హోర్ముజ్ జలసంధి వివాదాల వల్ల అంతర్జాతీయ వాణిజ్య మార్గాలు, చమురు సరఫరా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ భారతీయులకు పిలుపునిస్తూ.. 'అవసరం లేకపోతే బంగారం కొనవద్దు, విదేశీ యాత్రలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి ఖర్చులను వాయిదా వేసుకోండి' అని ఆయన కోరారు. భారత జీడీపీ జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసినప్పటికీ, గ్లోబల్ మార్కెట్ ఒడిదుడుకుల నుండి దేశాన్ని రక్షించుకోవాలంటే అనవసరమైన విదేశీ కరెన్సీ ఖర్చును చెక్ పెట్టక తప్పదని మోదీ స్పష్టం చేశారు.



# తుమ్మిడి హెట్టిపై తుది నిర్ణయం వాయిదా

**మూడు వారాల తర్వాత మరోసారి భేటీ**
**సాంకేతికత, అంతర్రాష్ట్ర అంశాలపై చర్చ**

న్యూఢిల్లీ, మహా : తుమ్మిడి హెట్టి బ్యారేజ్ ఎత్తు అంశంపై తెలంగాణ, మహారాష్ట్ర మధ్య కీలక చర్చలు జరిగాయి. ప్రాణహిత నదిపై ప్రతిపాదించిన బ్యారేజ్ నిర్మాణం, సాంకేతిక అంశాలు, అంతర్రాష్ట్ర సమస్యలపై న్యూఢిల్లీలోని సేవా భవన్‌లో కేంద్ర జల సంఘం చైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశం ముగిసింది. తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ భేటీలో ప్రధానంగా బ్యారేజ్ ఎత్తును 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచే ప్రతిపాదనపైనే చర్చ సాగింది. ఇరు రాష్ట్రాల వాదనలు, సాంకేతిక అంశాలను పరిశీలించిన అనంతరం మూడు వారాల తర్వాత మరోసారి సమావేశం కావాలని కేంద్ర జల సంఘం నిర్ణయించింది. తుమ్మిడి హెట్టి బ్యారేజ్ ఎత్తు 148 మీటర్లుగా గతంలో మహారాష్ట్ర అంగీకరించింది. అయితే ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఆ ఎత్తును 152 మీటర్లకు పెంచాలని కోరుతోంది. 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజ్ నిర్మిస్తే గురుత్వాకర్షణ ద్వారా నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ అధికారులు సమావేశంలో వివరించారు. దీంతో నీటిని తరలించేందుకు భారీ సామర్థ్యం కలిగిన పంపులను వినియోగించాల్సి వస్తుందని, ఫలితంగా విద్యుత్ వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. బ్యారేజ్ ఎత్తును 152 మీటర్లకు పెంచితే సుమారు 80 టీఎంసీల నీటిని గురుత్వాకర్షణ ద్వారా సుందిళ్ల బ్యారేజ్‌కు తరలించే అవకాశం ఉంటుందని తెలంగాణ అధికారులు కేంద్ర జల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. పంపింగ్‌పై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో విద్యుత్ ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందని వివరించారు. ప్రాజెక్టు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని 152 మీటర్ల ఎత్తు అవసరమని తెలంగాణ తన వాదనను వినిపించింది. బ్యారేజ్ ఎత్తు పెంచితే మహారాష్ట్రలో ముంపు సమస్య తలెత్తుతుందన్న అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. కేంద్ర జల సంఘం పరిధిలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ అధ్యయనాలను తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. 152 మీటర్లకు ఎత్తు పెంచినప్పటికీ మహారాష్ట్రలోని గ్రామాలకు అదనంగా ముంపు ముప్పు ఉండదని, నదీ గర్భం మాత్రమే ముంపునకు గురవుతుందని వారు వివరించారు. ఇదే సమయంలో గతంలో జరిగిన ఒప్పందాలను కూడా తెలంగాణ ప్రభుత్వం... కేంద్ర జల సంఘం ముందుంచింది. 2012లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రుల మధ్య 152 మీటర్ల ఎత్తుపై జరిగిన ఒప్పందాన్ని ప్రస్తావించింది. అనంతరం 2016లో బ్యారేజ్ ఎత్తును 148 మీటర్లకు తగ్గించడం వల్ల తెలంగాణకు ఎదురైన ఇబ్బందులను కూడా వివరించింది. గత ఒప్పందాన్ని సవరించి 152 మీటర్ల ఎత్తుకు అనుమతి ఇవ్వాల్సిన అవసరాన్ని వివరిస్తూ తెలంగాణ అధికారులు నివేదిక సమర్పించారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టుపై ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిర్చి..సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలకు పరిష్కారం కనుగొనే దిశగా కేంద్ర జల సంఘం ఈ చర్చలను కొనసాగిస్తోంది. ముఖ్యంగా వెనుకబడిన, కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించడంలో ప్రాజెక్టు కీలకంగా మారుతుందని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం గత కొన్ని నెలలుగా కేంద్రం దృష్టికి సమస్యను తీసుకెళ్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర జలశక్తి మంత్రికి లేఖలు రాస్తూ తుమ్మిడి హెట్టి అంశాన్ని పరిష్కరించాలని కోరిన నేపథ్యంలో ఈ సంయుక్త సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా జరిగిన భేటీలో తుది నిర్ణయం తీసుకోకపోవడంతో.. మూడు వారాల తర్వాత మరోసారి సమావేశమై సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై మరింత చర్చించాలని కేంద్ర జల సంఘం నిర్ణయించింది.

# హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు

హైదరాబాద్, మహా : హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి. వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం తెలంగాణలో స్వల్పకాలిక 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు', విభిన్న కోర్సులను అందించేందుకు ఆసక్తి కనబరిచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలతో జరిపిన చర్చలు కూడా ఫలవంతమయ్యాయి. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా హైదరాబాద్‌లోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం కింద విదేశీ వర్సిటీలకు లభించిన వెసులుబాటును వినియోగించుకుంటూ, ఉన్నత విద్యా రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది.



# ఆర్టీసీలో త్వరలో 1500 కండక్టర్ పోస్టుల భర్తీ

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

హైదరాబాద్, మహా టీజీఎస్ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. అలాగే దాదాపు 4 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా చివరిదశలో ఉందని పేర్కొన్నారు. ఈ విధంగా రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలను పెంచడం ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు. రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని ఇప్పటి వరకు 347.36 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని అన్నారు. ఈ మేరకు రూ. 12,167 కోట్లు ఆదా చేసుకున్నారని తెలిపారు. ఇక కొత్తగా 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేశామని.. 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ నగరంలో కొత్తగా మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కబోతున్నాయని తెలిపారు.



ANN తెలుగు

మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్

02-09-2026

మహా ప్రత్యేకం





# జనం గుండెల్లో.. తిరుగులేని జనసేనాని



## ఒక మనిషి.. రెండు ప్రస్థానాలు

### కోట్లాది హృదయాల్లో చెరగని ముద్ర

- తెరపై తిరుగులేని హీరో.. రాజకీయాల్లో ఓటమిని జయించిన యోధుడు!
- 2019లో రెండు పరాజయాలు.. ఐదేళ్లలోనే 21కి 21 విజయాలు
- పిఠాపురం నుంచి అసెంబ్లీకి.. ఉప ముఖ్యమంత్రి పీఠానికి
- పరాజయం నేర్పిన పాఠం.. విజయం చెప్పిన సమాధానం
- జనసేనాని జన్మదినం సందర్భంగా మహాపత్రిక స్పెషల్ స్టోరీ

సెప్టెంబరు 2న ఆయన జన్మదినం సందర్భంగా మహాపత్రిక ప్రత్యేక కథనం.

(మహా ప్రత్యేకం) : ఒక సాధారణ కుటుంబంలో పుట్టిన బాలుడు.. మార్షల్ ఆర్ట్స్‌పై మక్కువ పెంచుకున్న యువకుడు.. అన్నయ్య అడుగుజాడల్లో సినీ రంగంలోకి వచ్చిన నటుడు.. అక్కడ తనకంటూ ప్రత్యేకమైన శైలిని సృష్టించుకున్న 'పవర్‌స్టార్'.. ఆ తర్వాత ప్రజా సమస్యలపై స్పందించిన సామాజిక కార్యకర్త.. రాజకీయాల్లోకి వచ్చి తొలి అడుగుల వద్దే ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న నాయకుడు.. ఓటమితో వెనక్కి తగ్గకుండా పార్టీని నిలబెట్టుకున్న జనసేనాని. చివరకు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదిగి ఉప ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన నాయకుడు.. ఇదే కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రస్థానం.

ప్రజాదరణను రాజకీయ శక్తిగా మార్చుకోవడానికి ఒక నాయకుడు సాగించిన సుదీర్ఘ పోరాట కథ. బాపట్లలో మొదలైన జీవితం.. నెల్లూరులో విద్య.. మార్షల్ ఆర్ట్స్‌లో సాధన.. వెండితెరపై సంచలనం.. ప్రజారాజ్యంలో రాజకీయ ప్రవేశం.. జనసేన ఆవిర్భావం.. ప్రజా సమస్యలపై పోరాటాలు.. 2019లో ఘోర పరాజయం.. ఆ తర్వాత ఐదేళ్ల పునర్నిర్మాణం.. 2024లో పిఠాపురం నుంచి 70,279 ఓట్ల మెజార్టీతో విజయం.. జనసేన పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లో 21 విజయాలు.. రెండు లోక్‌సభ స్థానాల్లోనూ గెలుపు.. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి పదవి. ఈ ప్రయాణంలోని ప్రతి మలుపు ఒక ప్రత్యేక అధ్యాయమే.

## సినిమా స్టార్ డమ్ మధ్యే సామాజిక స్పృహ

పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి రావడానికి చాలా ముందే సామాజిక అంశాలపై స్పందించడం ప్రారంభించారు. సామాన్యుడి సమస్యలు, యువత భవిష్యత్తు, రాజకీయ వ్యవస్థలో మార్పు వంటి అంశాలపై ఆయన తన అభిప్రాయాలను వ్యక్తం చేసేవారు. అభిమానుల సంఘాలను సామాజిక సేవ వైపు మళ్లించాలనే ఆలోచన కూడా ఆయనలో కనిపించింది. ప్రజా సేవపై ఆసక్తి క్రమంగా రాజకీయ ఆలోచనగా మారింది. తాను కేవలం సినిమాల్లో నటిస్తూ ఉండిపోవాలనుకోవడం లేదని, సమాజంలో మార్పు కోసం ఏదో ఒక రూపంలో పనిచేయాలనే ఆలోచన తనలో ఉందని ఆయన రాజకీయ ప్రవేశానికి ముందే చెప్పిన సందర్భాలున్నాయి. 2008లో అన్నయ్య చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో యువజన విభాగం 'యువరాజ్యం' అధ్యక్షుడిగా నియమితులయ్యారు. యువతను రాజకీయాల్లోకి తీసుకురావడం, ప్రజా సేవ వైపు మళ్లించడం తన బాధ్యతగా ప్రకటించారు.

## బాలుడి నుంచి 'పవర్‌స్టార్'.. పవర్‌స్టార్ నుంచి 'జనసేనాని'


పవన్ కళ్యాణ్ కథలో బాపట్ల బాల్యం ఉంది. నెల్లూరు విద్య ఉంది. మార్షల్ ఆర్ట్స్ సాధన ఉంది. 1996లో మొదలైన సినిమా ప్రయాణం ఉంది. 'తొలిప్రేమ' నుంచి 'ఖుషి' వరకు యువతను ఉర్రూతలూగించిన స్టార్‌డమ్ ఉంది. 'జల్సా', 'గబ్బర్‌సింగ్', 'అత్తారింటికి దారేది' వంటి విజయాలతో తిరుగులేని క్రేజ్ ఉంది. ప్రజారాజ్యంలో రాజకీయ ప్రవేశం ఉంది. జనసేన ఆవిర్భావం ఉంది. ప్రత్యేక హోదా నుంచి ఉద్దానం వరకు ప్రజా సమస్యలపై పోరాటం ఉంది. 2019లో ఓటమి ఉంది. వారాహి యాత్రతో పునరాగమనం ఉంది. పిఠాపురం ప్రజల తీర్పు ఉంది. 70,279 ఓట్ల విజయం ఉంది. 21కి 21 అనే రాజకీయ రికార్డు ఉంది. చివరకు ఉప ముఖ్యమంత్రి పీఠం ఉంది. ఈ ప్రతి దశను కలిపితే కనిపించేది ఒక్క విషయం—పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి జీవితంలో గమ్యం కంటే ప్రయాణమే పెద్ద కథ.

**బాపట్లలో మొదలైన కథ.. 'కళ్యాణ్‌బాబు'గా బాల్యం**

1971 సెప్టెంబరు 2. బాపట్లలో కొణిదెల వెంకటరావు, అంజనాదేవి దంపతులకు జన్మించిన బాలుడే భవిష్యత్తులో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న పవన్ కళ్యాణ్. కుటుంబంలో అప్పటికే అన్నయ్య చిరంజీవి సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నప్పటికీ పవన్ కళ్యాణ్ తన స్వంత వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలనే తపనతో పెరిగారు. తండ్రి ఉద్యోగరీత్యా కుటుంబం వివిధ ప్రాంతాల్లో నివసించాల్సి రావడం, చిన్ననాటి అనుభవాలు, కుటుంబ వాతావరణం ఆయన వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేశాయి. పెద్దన్నయ్య చిరంజీవి, నాగేంద్రబాబు వంటి వ్యక్తుల మధ్య పెరిగినా.. తాను ఎంచుకున్న దారిలో తనదైన ముద్ర వేయాలనే స్వభావం ఆయనలో బలంగా కనిపించింది. భవిష్యత్తులో సినిమాల్లోనూ, రాజకీయాల్లోనూ 'ఇతరుల నీడలో కాదు.. తనదైన దారిలో' ప్రయాణించాలనే లక్షణం ఆయన వ్యక్తిత్వానికి ప్రధాన బలంగా మారింది. ఆయన ప్రారంభ జీవితంపై అందుబాటులో ఉన్న జీవిత చరిత్ర వివరాలు బాపట్ల జన్మస్థలాన్ని, కుటుంబ నేపథ్యాన్ని ధ్రువీకరిస్తున్నాయి.

**విద్యతో పాటు మరో ప్రపంచం.. మార్షల్ ఆర్ట్స్‌లో మక్కువ**

పవన్ కళ్యాణ్ విద్యాభ్యాసం నెల్లూరులోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌తో ముడిపడి ఉంది. అనంతరం మద్రాసులోనూ విద్య కొనసాగించారు. అయితే సాధారణ విద్యాభ్యాసంతో పాటు ఆయనను ప్రత్యేకంగా ఆకర్షించిన రంగం మార్షల్ ఆర్ట్స్. క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం వంటి లక్షణాలను పెంచిన ఈ సాధన ఆయన వ్యక్తిత్వంలో కీలక భాగంగా మారింది. కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించిన ఆయన 1997లో మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శన సందర్భంగా 'పవన్' అనే బిరుదును పొందారు. ఆ తర్వాత అదే పేరు ఆయనకు శాశ్వత గుర్తింపుగా మారింది. సినిమా రంగంలోకి వచ్చినప్పుడు కూడా ఆయన యాక్షన్ సన్నివేశాల్లో చూపించిన ప్రత్యేక శైలి వెనుక ఈ సాధనకు ఉన్న పాత్ర స్పష్టంగా కనిపించింది. తెరపై కనిపించిన పవన్ కళ్యాణ్ ఇతర హీరోల మాదిరిగా కాకుండా.. తనదైన బాడీ లాంగ్వేజ్, తనదైన నడక, తనదైన యాక్షన్ శైలితో ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి ఇదే ఒక బలమైన కారణమైంది.



**అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'.. వెండితెరపై తొలి అడుగు**

1996లో 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రంతో పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా సినీ రంగంలో అడుగు పెట్టారు. అది కేవలం ఒక సినిమా ప్రవేశం మాత్రమే. కానీ ఆ తర్వాత జరిగినది తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. 'గోకులంలో సీత', 'సుస్వాగతం', 'తొలిప్రేమ', 'తమ్ముడు', 'బద్రి', 'ఖుషి' వరుసగా విజయాలు సాధించడంతో పవన్ కళ్యాణ్ యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించారు. ముఖ్యంగా 'తొలిప్రేమ' ఆయనను స్టార్ హీరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రేమకథలోని సున్నితత్వం నుంచి యాక్షన్‌లోని దూకుడు వరకు.. పవన్ తన నటనలో ఒక ప్రత్యేకమైన ముద్రను వేశారు. యువత ఆయనను కేవలం హీరోగా చూడలేదు. ఆయన హెయిర్‌స్టైల్, దుస్తులు, నడక, మాట తీరు వరకు అనుకరించడం ప్రారంభించారు. అలా ఒక నటుడి నుంచి ఒక 'ఫెనామినన్'గా ఆయన రూపాంతరం చెందారు.

**హీరో మాత్రమే కాదు.. దర్శకుడు, రచయిత, నిర్మాత కూడా**

పవన్ కళ్యాణ్ తనను కేవలం కథానాయకుడి పాత్రకు పరిమితం చేసుకోలేదు. 2003లో 'జానీ' చిత్రంతో దర్శకుడిగా కూడా తన సత్తాను చాటాలని ప్రయత్నించారు. ఆ సినిమా వాణిజ్యపరంగా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా.. తన ఆలోచనలను తెరపైకి తీసుకురావాలనే ధైర్యాన్ని మాత్రం ఆయన ప్రదర్శించారు. ఆ తర్వాత 'గుడుంబా శంకర్', 'బాలు', 'బంగారం', 'అన్నవరం' వంటి చిత్రాల్లో వచ్చిన ఒడిదుడుకులు ఆయన స్టార్‌డమ్‌ను కొంతకాలం సవాలు చేశాయి. కానీ 2008లో 'జల్సా'తో వచ్చిన పునరాగమనం మరోసారి ఆయనలోని స్టార్ పవర్‌ను నిరూపించింది. 2012లో 'గబ్బర్‌సింగ్'తో వచ్చిన సంచలన విజయం ఆయన కెరీర్‌కు కొత్త ఊపునిచ్చింది. ఈ చిత్రానికి ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నారు. 2013లో 'అత్తారింటికి దారేది'తో మరో భారీ విజయాన్ని సాధించారు. ఆ తర్వాత 'గోపాల గోపాల', 'సర్దార్ గబ్బర్‌సింగ్', 'కాటమరాయుడు', 'అజ్ఞాతవాసి', 'వకీల్ సాబ్', 'భీమ్లానాయక్', 'బ్రో' తదితర చిత్రాలతో తన సినీ ప్రయాణాన్ని కొనసాగించారు.

**ప్రజారాజ్యం.. తొలి రాజకీయ పాఠశాల**

2008లో ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణానికి తొలి అధికారిక వేదికగా నిలిచింది. యువరాజ్యం అధ్యక్షుడిగా ఆయన రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారు. 2009 ఎన్నికల ప్రచారంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. అయితే ఆయన స్వయంగా ఎన్నికల్లో పోటీ చేయలేదు. ప్రజారాజ్యం పార్టీ తర్వాత కాంగ్రెస్‌లో విలీనం కావడం పవన్ కళ్యాణ్ రాజకీయ ఆలోచనలపై ప్రభావం చూపింది. పార్టీ విలీనానంతరం కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన.. చివరకు పూర్తిగా స్వతంత్ర రాజకీయ వేదికను నిర్మించాలనే నిర్ణయానికి వచ్చారు. అదే నిర్ణయం 2014లో జనసేన ఆవిర్భావానికి దారితీసింది.

**జనసేన ఆవిర్భావం.. రాజకీయాల్లో కొత్త ప్రయోగం**

2014 మార్చి 14న పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించారు. అప్పట్లో ఆయన రాజకీయ ప్రసంగాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. అవినీతి, పాలనలో జవాబుదారీతనం, యువత పాత్ర, సామాజిక న్యాయం వంటి అంశాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. 2014 ఎన్నికల్లో జనసేన నేరుగా పోటీ చేయకుండా తెలుగుదేశం-బీజేపీ కూటమికి మద్దతు ఇచ్చింది. ఆ కూటమి అధికారంలోకి వచ్చినా పవన్ కళ్యాణ్ ప్రభుత్వ పదవిని స్వీకరించలేదు. ఈ దశలో ఆయనకు రాజకీయంగా ఒక ప్రత్యేకమైన స్థానం ఏర్పడింది. అధికారంలో భాగస్వామి కాకుండా.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే మిత్రపక్ష నాయకుడిగా ఉండటం ఆయన రాజకీయ ప్రయోగంలో ముఖ్యమైన అంశంగా నిలిచింది.

**ప్రత్యేక హోదా నుంచి ప్రజా సమస్యల వరకు.. ప్రశ్నించే గొంతుక**

2014 తర్వాత పవన్ కళ్యాణ్ రాజకీయంగా మరింత దూకుడు పెంచారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశాన్ని ఆయన తీవ్రంగా లేవనెత్తారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రశ్నలు సంధించారు. ప్రత్యేక హోదా కోసం యువత చేపట్టాలనుకున్న నిరసనలకు అనుమతులు ఇవ్వకపోవడాన్ని కూడా ఆయన విమర్శించారు. 2017లో ప్రత్యేక హోదా అంశంపై ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పటి రాజకీయ వాతావరణంలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఉద్దానం కిడ్నీ వ్యాధి సమస్య, రైతుల ఇబ్బందులు, ఇసుక అక్రమ రవాణా, భూసంబంధిత సమస్యలు, ప్రజల స్థానిక సమస్యలు వంటి అనేక అంశాలను ఆయన రాజకీయ వేదికపైకి తీసుకొచ్చారు. ఒక పార్టీ అధినేతగా మాత్రమే కాకుండా.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రజా గొంతుగా తన స్థానాన్ని బలపర్చుకునే ప్రయత్నం చేశారు.

**2019.. రాజకీయ జీవితంలో అత్యంత కఠినమైన పరీక్ష**

2019 ఎన్నికలు పవన్ కళ్యాణ్‌కు రాజకీయంగా అత్యంత కఠినమైన పరీక్షగా నిలిచాయి. జనసేన తొలిసారి స్వతంత్రంగా పెద్ద ఎత్తున ఎన్నికల బరిలోకి దిగింది. పవన్ కళ్యాణ్ గాజువాక, భీమవరం నుంచి పోటీ చేశారు. రెండు స్థానాల్లోనూ ఆయన ఓటమి చెందారు. జనసేన పోటీ చేసిన 137 అసెంబ్లీ స్థానాల్లో ఒక్క రాజోలు స్థానంలో మాత్రమే విజయం సాధించింది. ఆ ఫలితం రాజకీయ ప్రత్యర్థులకు విమర్శలకు అవకాశం ఇచ్చింది. సినీ స్టార్‌డమ్‌ను ఓట్లుగా మార్చడం సాధ్యం కాదన్న వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. రాజకీయంగా పవన్ కళ్యాణ్ ప్రయాణం ముగిసిపోయిందని కూడా కొందరు భావించారు. కానీ ఆ అంచనాలన్నింటికీ ఆయన తర్వాతి ఐదేళ్లలో సమాధానం ఇచ్చారు. 2019 ఓటమి ఆయనకు ముగింపు కాకుండా.. రాజకీయ పునర్నిర్మాణానికి ఆరంభంగా మారింది.

**ఓటమి తర్వాత పునర్నిర్మాణం.. రోడ్డుపైకి వచ్చిన జనసేనాని**

2019 పరాజయం తర్వాత పవన్ కళ్యాణ్ పార్టీని నిలబెట్టుకోవడంపైనే దృష్టి పెట్టారు. రైతుల సమస్యలు, ఇసుక కొరత, మహిళల భద్రత, భూకబ్జా ఆరోపణలు, ప్రజా సమస్యలపై పార్టీ కార్యకర్తలతో కలిసి కార్యక్రమాలు నిర్వహించారు. అధికార రాజకీయాల్లో తన బలం ఎంత ఉందో తెలుసుకునే దిశగా గ్రామస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నించారు. సినిమాల్లో నటిస్తూనే రాజకీయ కార్యక్రమాలను కొనసాగించారు. ఈ దశలో ఆయన రాజకీయంగా చేసిన ఒక ముఖ్యమైన పని.. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని పెంచుకోవడం. 2023లో వారాహి వాహనంతో రాష్ట్రవ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టడం ఆ ప్రయత్నానికి పరాకాష్టగా నిలిచింది.

**వారాహి యాత్ర.. జనసేనకు కొత్త ఊపిరి**

2023 జూన్ 14న అన్నవరం నుంచి 'వారాహి విజయయాత్ర' ప్రారంభమైంది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన వారాహి వాహనంపై పవన్ కళ్యాణ్ వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజల సమస్యలను వినేందుకు 'జనవాణి' కార్యక్రమాలను నిర్వహించారు. రైతులు, మహిళలు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, యువత వంటి వివిధ వర్గాలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ విధానాలను విమర్శించడంతో పాటు.. ప్రజల నుంచి



నేరుగా సమస్యలను స్వీకరించారు. ఈ యాత్ర జనసేన రాజకీయ శక్తిని పునరుద్ధరించడంలో కీలకంగా మారింది. 2019లో ఓటమితో నిరుత్సాహానికి గురైన కార్యకర్తల్లో మళ్లీ నమ్మకాన్ని నింపింది. 2024 ఎన్నికల ముందు జనసేనను కూటమి రాజకీయాల్లో కీలక భాగస్వామిగా నిలబెట్టడానికి ఈ దశలో ఏర్పడిన రాజకీయ పునాది ఉపయోగపడింది.

**టీడీపీ–బీజేపీతో పొత్తు.. రాజకీయ వ్యూహంలో కీలక మలుపు**

2024 ఎన్నికలకు ముందు పవన్ కళ్యాణ్ తీసుకున్న మరో కీలక నిర్ణయం తెలుగుదేశం, బీజేపీతో కలిసి ఎన్నికల బరిలోకి దిగడం. సీట్ల సర్దుబాటులో జనసేనకు 21 అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్‌సభ స్థానాలు దక్కాయి. పవన్ కళ్యాణ్ స్వయంగా పిఠాపురం నుంచి పోటీ చేయాలని నిర్ణయించారు. 2019లో రెండు స్థానాల్లో పోటీ చేసి ఓడిపోయిన నాయకుడు.. 2024లో ఒకే నియోజకవర్గాన్ని ఎంచుకుని పూర్తి స్థాయిలో అక్కడే దృష్టి పెట్టడం రాజకీయ వ్యూహంగా మారింది. పిఠాపురాన్ని తన రాజకీయ కేంద్రంగా మార్చుకుని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కూటమి వ్యూహం, ప్రభుత్వ వ్యతిరేకత, పవన్ వ్యక్తిగత ప్రజాదరణ, పార్టీ శ్రేణుల కృషి కలిసి ఎన్నికల సమీకరణాలను మార్చాయి.

**పిఠాపురం తీర్పు.. 70,279 ఓట్లతో చరిత్రాత్మక విజయం**

2024 జూన్ 4న వెలువడిన ఎన్నికల ఫలితాలు పవన్ కళ్యాణ్ రాజకీయ జీవితాన్ని పూర్తిగా మార్చేశాయి. పిఠాపురం నుంచి పోటీ చేసిన ఆయన 1,34,394 ఓట్లు సాధించి వైసీపీ అభ్యర్థి వంగా గీతపై 70,279 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2019లో గాజువాక, భీమవరం రెండు చోట్లా ఓడిన నాయకుడు ఐదేళ్ల తర్వాత 70 వేలకు పైగా మెజార్టీతో గెలవడం రాజకీయంగా విశేష పరిణామంగా నిలిచింది. కానీ పవన్ వ్యక్తిగత విజయాన్ని మించిన సంచలనం జనసేన సాధించిన ఫలితమే. పార్టీ పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయం సాధించింది. రెండు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసి రెండింటినీ గెలుచుకుంది. అంటే అసెంబ్లీ, లోక్‌సభ రెండింటిలోనూ జనసేనకు 100 శాతం విజయ శాతం నమోదైంది.

**21కి 21.. జనసేన చరిత్రలో అరుదైన ఘట్టం**

రాజకీయ పార్టీల చరిత్రలో ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్‌రేట్ సాధించడం అరుదైన విషయం. జనసేన మాత్రం 2024లో తాను పోటీ చేసిన ప్రతి అసెంబ్లీ స్థానంలో గెలిచింది. 21 స్థానాల్లో 21 విజయాలు.. రెండు లోక్‌సభ స్థానాల్లో రెండు విజయాలు.. ఇది కేవలం ఎన్నికల గణాంకం కాదు. 2019లో ఒక్క సీటుకే పరిమితమైన పార్టీ ఐదేళ్లలోనే రాష్ట్ర అధికార సమీకరణాల్లో కీలక భాగస్వామిగా మారిందనే వాస్తవానికి ఇది ప్రతీక. పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా కూడా తొలి ఎన్నికల విజయాన్ని నమోదు చేసుకున్నారు. అందుకే 2024 ఫలితాల తర్వాత ఆయన రాజకీయ ప్రయాణాన్ని విశ్లేషించిన అనేక కథనాల్లో 'పరాజయం నుంచి పునరాగమనం' ప్రధాన అంశంగా నిలిచింది.

**సినీ హీరో నుంచి ప్రభుత్వ నాయకుడిగా.. ఉప ముఖ్యమంత్రి పీఠంపై**

2024 ఎన్నికల అనంతరం ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడింది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించగా.. పవన్ కళ్యాణ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి అనంతరం ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలు కేటాయించబడ్డాయి. అధికారిక ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ వెబ్‌సైట్ కూడా పవన్ కళ్యాణ్‌ను ఉప ముఖ్యమంత్రిగా, పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతికం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రిగా పేర్కొంటోంది.

**పల్లె పాలనపై దృష్టి.. గ్రామీణాభివృద్ధే కొత్త పరీక్ష**

ఉప ముఖ్యమంత్రి పదవి పవన్ కళ్యాణ్ రాజకీయ జీవితంలో మరో కొత్త అధ్యాయానికి తెరతీసింది. ఒకప్పుడు సభల్లో ప్రభుత్వాలను ప్రశ్నించిన నాయకుడు.. ఇప్పుడు ప్రభుత్వంలో భాగంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన బాధ్యతను స్వీకరించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామస్థాయి పరిపాలనను బలోపేతం చేయడం, గ్రామీణ మౌలిక వసతులు మెరుగుపరచడం, స్థానిక సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలపై ఆయన దృష్టి పెట్టారు. గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ వంటి విభిన్న రంగాలు ఒకే సమయంలో ఆయన బాధ్యతల్లోకి రావడం పాలనాపరంగా కూడా పెద్ద సవాలే. ప్రభుత్వ అధికారిక వ్యవస్థలో ఆయనకు కేటాయించిన శాఖలు గ్రామం నుంచి పర్యావరణం వరకు విస్తరించి ఉన్నాయి.

**ప్రజా వేదిక నుంచి పరిపాలనా వేదికకు.. మారిన బాధ్యత**

పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రస్థానంలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఇదే. మొదట ప్రజా సమస్యలను బయట నుంచి ప్రశ్నించారు. తర్వాత పార్టీ పెట్టి రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించడానికి ప్రయత్నించారు. ఓటమిని ఎదుర్కొన్నారు. మళ్లీ ప్రజల్లోకి వెళ్లారు. చివరకు అధికారంలో భాగస్వామిగా మారారు. ఇప్పుడు ఆయన ముందున్న పరీక్ష విమర్శించడం కాదు.. తాను చేపట్టిన శాఖల్లో ఫలితాలు చూపించడం. అభిమానుల అంచనాలు, జనసేన కార్యకర్తల ఆకాంక్షలు, కూటమి ప్రభుత్వ బాధ్యతలు, ప్రజల నమ్మకం.. ఇవన్నీ ఒకేసారి ఆయనపై ఉన్నాయి. అందుకే పవన్ కళ్యాణ్ రాజకీయ జీవితంలో 2024 విజయాన్ని ఒక గమ్యస్థానంగా కాకుండా కొత్త బాధ్యతల ప్రారంభంగా చూడాల్సిన అవసరం ఉంది.

**పవర్‌స్టార్ అనే ఇమేజ్.. ప్రజా నాయకుడిగా నిరూపించుకోవాల్సిన సమయం**

పవన్ కళ్యాణ్ సినీ జీవితాన్ని చూస్తే విజయాలు, పరాజయాలు రెండూ కనిపిస్తాయి. రాజకీయ జీవితాన్ని చూస్తే కూడా అదే చిత్రం కనిపిస్తుంది. కానీ ఈ రెండు రంగాల్లోనూ ఒక సామాన్యత ఉంది. పడిపోయిన తర్వాత మళ్లీ లేచే స్వభావం. సినిమా రంగంలో వరుస పరాజయాల తర్వాత 'జల్సా', 'గబ్బర్‌సింగ్' వంటి విజయాలతో పునరాగమనం చేసినట్లే.. రాజకీయాల్లో 2019 పరాజయం తర్వాత 2024లో చరిత్రాత్మక విజయాన్ని అందుకున్నారు. అయితే సినిమా విజయం కొన్ని గంటలు, కొన్ని వారాలు మాత్రమే మాట్లాడుకునే విషయం కావచ్చు. రాజకీయ విజయం మాత్రం ప్రజల జీవితాలతో ముడిపడి ఉంటుంది. అందుకే ఇప్పుడు ఆయనకు ఎదురవుతున్న అసలు సవాలు మరింత పెద్దది. పవర్‌స్టార్ అనే అభిమానుల బిరుదును మించి.. ప్రజల జీవితాల్లో పనిచేసే నాయకుడిగా తన స్థానాన్ని శాశ్వతం చేసుకోవడమే.

**అభిమానుల హీరో నుంచి ప్రజల నాయకుడి వరకు.. ఇక అసలు అధ్యాయం**

పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఆయన జీవితాన్ని గుర్తుచేసుకోవడం అంటే కేవలం ఆయన సినిమాల విజయాలను లెక్కించడం కాదు. తెరపై ఆయన సృష్టించిన ప్రభావం ఎంత పెద్దదో.. రాజకీయాల్లో ఆయన ఎదుర్కొన్న పరీక్షలు కూడా అంతే పెద్దవి. ఒకవైపు కోట్లాది మంది అభిమానుల అంచనాలు.. మరోవైపు రాజకీయ ప్రత్యర్థుల విమర్శలు.. మధ్యలో ఎన్నో ఓటములు.. అయినా తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించిన పట్టుదల.. చివరకు అధికారంలోకి తీసుకువచ్చిన ఎన్నికల వ్యూహం.. ఇవన్నీ ఆయన కథలో భాగాలే. 2024లో వచ్చిన విజయం ఆయన గతాన్ని మార్చలేదు; కానీ ఆ గతానికి కొత్త అర్థాన్ని ఇచ్చింది. 2019లో 'ఓడిపోయిన నాయకుడు'గా కనిపించిన వ్యక్తే 2024లో '21కి 21 గెలిపించిన జనసేనాని'గా నిలిచారు. పిఠాపురం నుంచి ప్రజా ప్రతినిధిగా అసెంబ్లీలోకి అడుగుపెట్టి.. ఉప ముఖ్యమంత్రిగా ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టారు.

**అసలు పరీక్ష ఇప్పుడే మొదలు**

పవన్ కళ్యాణ్ జీవిత ప్రయాణాన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే.. "చప్పట్ల నుంచి ఓట్ల వరకు.. ఓటమి నుంచి అధికార బాధ్యత వరకు సాగిన అసాధారణ ప్రయాణం" అని చెప్పవచ్చు. సినీ రంగం ఆయనకు పేరు ఇచ్చింది. అభిమానులు ఆయనకు అపారమైన ప్రజాదరణ ఇచ్చారు. రాజకీయాలు ఆయనకు పరీక్షలు పెట్టాయి. ఓటములు ఆయనను కఠినతరం చేశాయి. జనసేన ఆయనకు ఒక వేదిక ఇచ్చింది. పిఠాపురం ప్రజలు ఆయనకు ప్రజా ప్రతినిధి హోదా ఇచ్చారు. 2024 ఎన్నికలు ఆయనకు రాజకీయ పునర్జన్మను ఇచ్చాయి. ఉప ముఖ్యమంత్రి పదవి మాత్రం ఆయనకు కొత్త బాధ్యతను అప్పగించింది. ఇక నుంచి ఆయన ప్రయాణాన్ని నిర్ణయించేది సినిమా వసూళ్లు కాదు.. రాజకీయ సభలకు వచ్చే జనసందోహం కాదు.. ప్రభుత్వంలో తీసుకునే నిర్ణయాలు, గ్రామాల్లో కనిపించే మార్పు, ప్రజల జీవితాల్లో కలిగే ఫలితం. అందుకే పవన్ కళ్యాణ్ జన్మదినం ఒక స్టార్ పుట్టినరోజు మాత్రమే కాదు.. ఒక రాజకీయ ప్రయాణాన్ని తిరిగి చూసుకునే సందర్భం కూడా. బాపట్లలో పుట్టిన కళ్యాణ్‌బాబు.. తెలుగు తెరపై పవర్‌స్టార్‌గా ఎదిగి.. రాజకీయ రంగంలో జనసేనానిగా నిలిచి.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజా పాలనలో తన ముద్ర వేయాల్సిన దశకు చేరుకున్నారు. గతం ఘనమైనది.. ప్రయాణం సంచలనమైనది.. కానీ భవిష్యత్తు తీర్పు మాత్రం పాలన ఎలా ఉంటుందన్నదానిపైనే ఆధారపడి ఉంటుంది.వన్ కళ్యాణ్ జీవిత ప్రయాణాన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే.. "చప్పట్ల నుంచి ఓట్ల వరకు.. ఓటమి నుంచి అధికార బాధ్యత వరకు సాగిన అసాధారణ ప్రయాణం" అని చెప్పవచ్చు. సినీ రంగం ఆయనకు పేరు ఇచ్చింది. అభిమానులు ఆయనకు అపారమైన ప్రజాదరణ ఇచ్చారు. రాజకీయాలు ఆయనకు పరీక్షలు పెట్టాయి. ఓటములు ఆయనను కఠినతరం చేశాయి. జనసేన ఆయనకు ఒక వేదిక ఇచ్చింది. పిఠాపురం ప్రజలు ఆయనకు ప్రజా ప్రతినిధి హోదా ఇచ్చారు. 2024 ఎన్నికలు ఆయనకు రాజకీయ పునర్జన్మను ఇచ్చాయి. ఉప ముఖ్యమంత్రి పదవి మాత్రం ఆయనకు కొత్త బాధ్యతను అప్పగించింది. ఇక నుంచి ఆయన ప్రయాణాన్ని నిర్ణయించేది సినిమా వసూళ్లు కాదు.. రాజకీయ సభలకు వచ్చే జనసందోహం కాదు.. ప్రభుత్వంలో తీసుకునే నిర్ణయాలు, గ్రామాల్లో కనిపించే మార్పు, ప్రజల జీవితాల్లో కలిగే ఫలితం. అందుకే పవన్ కళ్యాణ్ జన్మదినం ఒక స్టార్ పుట్టినరోజు మాత్రమే కాదు.. ఒక రాజకీయ ప్రయాణాన్ని తిరిగి చూసుకునే సందర్భం కూడా. బాపట్లలో పుట్టిన కళ్యాణ్‌బాబు.. తెలుగు తెరపై పవర్‌స్టార్‌గా ఎదిగి.. రాజకీయ రంగంలో జనసేనానిగా నిలిచి.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజా పాలనలో తన ముద్ర వేయాల్సిన దశకు చేరుకున్నారు. గతం ఘనమైనది.. ప్రయాణం సంచలనమైనది.. కానీ భవిష్యత్తు తీర్పు మాత్రం పాలన ఎలా ఉంటుందన్నదానిపైనే ఆధారపడి ఉంటుంది.

- ( గడల నరసింహారావు, మహా పత్రిక అసోసియేట్ ఎడిటర్ )



# ఆయిల్‌పామ్‌తో దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం

- **వరితో పోలిస్తే రెట్టింపు లాభాలు. పాలకుర్తి మండలంలో నాలుగో ఏడాది పంట కోత**

**పాలకుర్తి, మహా** : పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలం లో దీర్ఘకాలికంగా రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే పంటల్లో ఆయిల్‌పామ్ సాగు ఎంతో ప్రయోజనకరమని రామగుండం ఉద్యానవన అధికారి ఏ. జ్యోతి అన్నారు. పాలకుర్తి మండలంలోని ఈసాల తక్కలపల్లి గ్రామంలో 202223 సంవత్సరంలో సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలో నాలుగో ఏడాది పంట కోతను రైతులు మంగళవారం నిర్వహించారు.ఈసాల తక్కలపల్లికి చెందిన రైతు కదారి విజయ వ్యవసాయ క్షేత్రంలో నాలుగోసారి ఆయిల్‌పామ్ గెలల కోత చేపట్టారు. పెద్దపల్లిలోని తిరుమల ఆయిల్ కంపెనీ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ పాలకుర్తి మండలంలోని రైతులు సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలని సూచించారు. ఒక ఎకరం వరి సాగుకు వినియోగించే నీటితో సుమారు 3 నుంచి 4 ఎకరాల వరకు ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం గరిష్ట స్థాయిలో రాయితీలు అందిస్తోందని పేర్కొన్నారు. టీవల ఆయిల్‌పామ్ గెలల ధరలు కూడా పెరగడంతో రైతులకు మరింత లాభదాయకంగా మారిందని, వరి సాగుతో పోలిస్తే ఆయిల్‌పామ్ సాగు ద్వారా రెట్టింపు ఆదాయం పొందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.నాలుగో ఏడాది పంట కోత రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందవచ్చని అధికారులు రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, రామగుండం ఉద్యానవన అధికారి ఏ. జ్యోతి, తిరుమల ఆయిల్‌పామ్ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ మరియు రైతులు పాల్గొన్నారు.

# రూ.70 లక్షలతో సీసీ రోడ్లకు శ్రీకారం..

- **వినాయక్‌నగర్, సుందరయ్యనగర్‌లో భూమిపూజ..**
- **మౌలిక వసతుల కల్పనకే ప్రాధాన్యం..**
- **ఎమ్మెల్యే పాయం**



**మణుగూరు, మహా** : పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని వినాయక్‌నగర్, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో సుమారు రూ.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణంతో ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగి ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రజల అవసరాలను గుర్తిస్తూ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, ఏఈ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కురం రవి, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, రాష్ట్ర, యూత్ నాయకులు, గుమాస్తాల సంఘం నాయకులు, మహిళా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

**వైద్య చికిత్సకు రూ.4 లక్షల ఎల్‌ఓసీ**

బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన వసంత శివ నాగేశ్వరరావు వైద్య చికిత్స నిమిత్తం రూ.4 లక్షల విలువైన ఎల్‌ఓసీని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. మంగళవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శివ నాగేశ్వరరావు సతీమణి శ్రీదేవికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎల్‌ఓసీల ద్వారా ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైద్య చికిత్సకు రూ.4 లక్షల ఎల్‌ఓసీ మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు శివ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**శ్రీరాంపూర్‌లో ఉద్యోగుల నిరసన**

**పెద్దపల్లి, మహా :** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ విద్రోహ దినం సందర్భంగా శ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టిజిఆర్ఎస్ఏ ) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, శ్రీరాంపూర్ తహసీల్దార్ డా. రాపెల్లి రాముడు మాట్లాడుతూ.. ఉద్యోగులకు భద్రమైన భవిష్యత్తు కల్పించేందుకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయడంతో పాటు పిఆర్‌సిని తక్షణమే అమలు చేయాలని కోరారు.వివిధ కారణాలతో నిలిచిపోయిన ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలు ఐక్యంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటాన్ని కొనసాగిస్తాయని డా. రాపెల్లి రాముడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల గిర్దావర్లు ఎం. వినోద్, రాజేష్, ఎంపీఎస్ఓ శ్రీవాణి, జీపీఓలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# ఫౌండేషన్ కోర్సు శిక్షణ తరగతులు

- **బీసీ స్టడీ సర్కిల్ లో కలెక్టర్ సూచనలు**
- **కఠోర శ్రమతో పాటు స్మార్ట్ వర్క్ అవసరమని వెల్లడి**

**ఆదిలాబాద్ మహా** : పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే కఠోర శ్రమతో పాటు ప్రణాళికాబద్ధమైన స్మార్ట్ వర్క్ ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మెరిట్ అభ్యర్థులకు ఫౌండేషన్ కోర్సు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు.ముందుగా బిసి స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ పొంది ఉద్యోగం సాధించిన పలువురు అభ్యర్థులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించి అభినందించారు. సిలబస్‌పై పూర్తి పట్టు సాధించి, పరిమితమైన ప్రామాణిక పుస్తకాలను మాత్రమే ఎంచుకోవాలని కలెక్టర్ సూచించారు. స్టాటిక్ అంశాలను సమకాలీన పరిణామాలతో అనుసంధానిస్తూ నోట్స్ తయారు చేసుకోవాలని, ఇది మెయిన్స్ ఆన్సర్ రైటింగ్‌కు ఎంతో దోహదపడుతుందన్నారు. ఆబ్జెక్టివ్ పరీక్షల్లో ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడంలో ఎలిమినేషన్ మెథడ్ కీలకమని, దీనికోసం అధిక సంఖ్యలో మోడల్ పేపర్లు, మాక్ టెస్టులు ప్రాక్టీస్ చేయాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల వంటి ఆటంకాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదవాలని సూచించారు. త్వరలో ప్రభుత్వం నుంచి పలు ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడనున్న నేపథ్యంలో, బీసీ స్టడీ సర్కిల్ అందించే శిక్షణను, అధ్యాపకుల మార్గదర్శకత్వాన్ని అభ్యర్థులు నూటికి నూరు శాతం సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి సునీతకుమారి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, అధ్యాపకులు, ఉద్యోగ విజేతలు, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో భారీ ధర్నా

**పెద్దపల్లి, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, ప్రజల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి తెలిపారు.పెద్దపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌక్, బస్టాండ్ చౌరస్తా వద్ద ఉదయం 10 గంటలకు భారీ ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, రైతులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యకర్తలు, నాయకులు ఉదయం 10 గంటలకు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు వద్దకు చేరుకోవాలని, అక్కడి నుంచి అందరూ కలిసి అంబేద్కర్ చౌక్‌కు చేరుకుని ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని దాసరి మనోహర్ రెడ్డి కోరారు.ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల తరఫున నిలదీసేందుకు ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



# పూనెం సరోజకు ఘన సన్మానం..

- **జిల్లా మహిళా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు**
- **మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నేతల ఆకాంక్ష**

**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా కమిటీ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజను మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు గురిజాల గోపి, స్థానిక రేణుకా చౌదరి క్యాంపు కార్యాలయంలో రేణుక అక్షర మహిళా మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మహిళా కమిటీ కార్యదర్శిగా సరోజ నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మహిళల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంతో పాటు వారిని మరింతగా సంఘటితం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో ఆమె విజయవంతంగా రాణించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూనెం సరోజను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేషనల్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బోగినేని వరలక్ష్మి, పార్టీ సీనియర్ నాయకురాలు ఎండీ షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, రెడ్డిబోయిన రేణుక, రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, జాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## సీపీఎస్ రద్దు కోసం నిరసన

**కారేపల్లి. మహా :** సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, సింగరేణి మండలంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట మండల పరిషత్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. గాంధీపురం గిరిజన సంక్షేమ గురుకులంలో ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని చేశారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రతను దృష్టిలో ఉంచుకుని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ జి.హరికృష్ణ, ఉపాధ్యాయులు తన్నీరు నాగేశ్వరరావు, కుంజా రామారావు, జయరాజు, కార్యదర్శుల సంఘం నాయకులు బీ. నెహ్రూ, తిలక్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాటంతోనే కార్మిక హక్కుల సాధన..

- **24 డిమాండ్లపై ఒప్పందం ఏఐటీయూసీ విజయం..**
- **సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి**
- **ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్**



**మణుగూరు, మహా** : పోరాటాలతోనే సింగరేణి కార్మికుల హక్కుల సాధన సాధ్యమని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ అన్నారు. సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ ఏప్రిల్‌లో ఇచ్చిన సమ్మె నోటీసుతో యాజమాన్యం దిగివచ్చిందని పేర్కొన్నారు. మణుగూరు కేసీహెచ్ పీ వద్ద మంగళవారం నిర్వహించిన పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఆగస్టు 27న లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చల్లో మొత్తం 24 డిమాండ్లపై ఒప్పందం కుదరడం కార్మికుల విజయమన్నారు. కార్మికులు 13 ఏళ్లుగా ఎదురుచూస్తున్న పెర్క్స్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే చెల్లించేందుకు అంగీకరించడం కీలక పరిణామమన్నారు. కార్మికుడు సహజ మరణం చెందితే కుటుంబానికి రూ.20 లక్షలు చెల్లించడం, ప్రతినెలా మెడికల్ బోర్డు నిర్వహించడం, సకాలంలో సేఫ్టీ మెటీరియల్ అందించడం, డిస్మిస్డ్ కార్మికుల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై అంగీకారం కుదిరిందన్నారు. మైనింగ్, టెక్నికల్ సిబ్బంది వైద్యపరంగా అన్‌ఫిట్ అయితే సర్ఫేస్‌లో వారికి అనువైన ఉద్యోగం కల్పించే అంశం కూడా ఒప్పందంలో ఉందన్నారు. 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటాను దసరా పండుగలోపు చెల్లించడం, మెడికల్ అటెండెన్స్ రూల్స్‌లో మార్పులు, సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించడం వంటి అంశాలపైనా సానుకూల నిర్ణయం జరిగిందన్నారు. జనరల్ స్ట్రైక్‌లో పాల్గొనే కాంట్రాక్ట్ కార్మికులపై 'నో వర్క్-నో వేజెస్'కు మించి పెనాల్టీ విధించకుండా చూడటంతో పాటు కార్మికులకు సొంతింటి పథకం అమలుపై ప్రభుత్వంతో చర్చిస్తామని యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు.

**సింగరేణి బకాయిలు చెల్లించాలి**

గత ప్రభుత్వ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యంతో సంస్థకు తీవ్ర నష్టం జరిగిందని రాంగోపాల్ ఆరోపించారు. గతంలో సుమారు రూ.27 వేల కోట్ల బకాయిలు ఉండగా, ప్రస్తుతం సింగరేణికి రావాల్సిన బకాయిలు రూ.56 వేల కోట్లకు చేరాయని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని వెంటనే సింగరేణికి చెల్లించాలని ఏఐటీయూసీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలో అధికారంలో ఉండి గుర్తింపు సంఘంగా కొనసాగిన వారు కార్మికులకు చేసిందేమీ లేకపోగా, ప్రస్తుతం ఏఐటీయూసీ సాధించిన ఒప్పందాన్ని విమర్శించడం సరికాదన్నారు.

**సేవ్ మణుగూరు'తో మరో 30 ఏళ్ల భవిష్యత్**

సేవ్ మణుగూరు పోరాటం ఫలితంగా పీకేఓసీ 2 డిసైడ్ బ్లాక్ సింగరేణికి దక్కిందని, దీనివల్ల మణుగూరు ప్రాంతానికి మరో 30 ఏళ్ల భవిష్యత్ లభించిందని రామ్‌గోపాల్ పేర్కొన్నారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచిన తర్వాత తాడిచర్ల బ్లాక్‌తో పాటు మణుగూరు పీకేఓసీ2 డిసైడ్ బ్లాక్‌ను సాధించుకున్నామన్నారు. ఇల్లందు పూసపల్లి ఓసీ కూడా త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు సంస్థలకు దక్కిన కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులను తిరిగి సింగరేణికి దక్కేలా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. 12వ వేజ్‌బోర్డు అమలుకు సంబంధించి సెప్టెంబర్ 2న జాతీయ కార్మిక సంఘాలతో యాజమాన్యం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. చర్చలు విఫలమైతే జాతీయ కార్మిక సంఘాలు చేపట్టే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కార్మికులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గెలుపోటములతో సంబంధం లేకుండా కార్మికుల హక్కుల రక్షణ, సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ముందుండి పోరాడుతుందని రామ్‌గోపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామనర్సయ్య, ఆఫీస్ బేరర్ ఆవుల నాగరాజు, ఫిట్ సెక్రటరీ జి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ ఉడత శివ, డి.వెంకటేశ్వర్లు, గౌస్‌పాషా, జంజర్ల మోహన్, వలి, జగన్మోహన్, బైరి వెంకటేశ్వర్లు, బీవీ సత్యనారాయణ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్‌పై పట్టు.. ఓపీఎస్ కోసం పోరు

- **సీపీఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యోగుల గళం.. సెప్టెంబర్ 1న నల్లబ్యాడ్జీలతో నిరసన**




**కరీంనగర్, మహా**: పదవీ విరమణ తర్వాత భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న ఉద్యోగులను వెంటాడుతోంది. మార్కెట్ హెచ్చుతగ్గులపై ఆధారపడే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్ వద్దు.. ప్రభుత్వ భరోసాతో కూడిన పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) కావాలంటూ ఉద్యోగులు మరోసారి తమ గళాన్ని వినిపించారు. సెప్టెంబర్ 1ను పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ కరీంనగర్‌లో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. కరీంనగర్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్‌గౌడ్ మాట్లాడుతూ.. "పెన్షన్ ఉద్యోగి హక్కు.. భిక్ష కాదు, దయాదాక్షిణ్యం కాదు, ఎక్స్‌గ్రేషియా అంతకన్నా కాదు" అని స్పష్టం చేశారు. దశాబ్దాలపాటు ప్రభుత్వ సేవ అందించిన ఉద్యోగికి పదవీ విరమణ తర్వాత సామాజిక, ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు.

**మార్కెట్ దయపై భవిష్యత్తా?**

2004కు ముందు ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి భరోసాతో కూడిన పెన్షన్ వ్యవస్థ ఉండగా.. ఆ తర్వాత ఉద్యోగంలో చేరిన వారి పదవీ విరమణ భవిష్యత్తును మార్కెట్ పరిస్థితులతో ముడిపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. షేర్ మార్కెట్ హెచ్చుతగ్గులకు ఉద్యోగి జీవితకాల పొదుపులను అప్పగించడం సామాజిక భద్రత స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. పెన్షన్‌ను ఉద్యోగి హక్కుగా గుర్తించిన న్యాయస్థానాల తీర్పుల స్ఫూర్తికి అనుగుణంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రస్తుత పెన్షన్ విధానంలో అవసరమైన మార్పులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**హామీలు అమలు చేయాలి**

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ నాయకత్వం పలుమార్లు మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించిందని తెలిపారు. చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. "మా సహనాన్ని చేతగానితనంగా భావించవద్దు.. ఉద్యమాలు మాకు కొత్త కాదు" అని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగులు పోషించిన పాత్రను గుర్తుచేస్తూ.. హక్కుల సాధన కోసం అవసరమైతే మరోసారి ఐక్యంగా ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

ప్రస్తుతం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మడిపల్లి కాళీచరణ్‌గౌడ్, TSCPSEU రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, ఎడ్ల అరవింద్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం నాయకులు కేశవరెడ్డి, ఎలదాసరి లింగయ్య, మోసం అంజయ్య, జాలి మహేందర్‌రెడ్డి, కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్‌సింగ్, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్‌భరద్వాజ్, కార్యదర్శి సుమంత్‌రావు, రామస్వామి శంకర్, మహిళా చైర్మన్ శారద, సునీత, సరిత, హరిప్రియ, సూర్య, సుమలత, సుస్మిత, వైద్యుల రాజిరెడ్డి, తుముల తిరుపతి, రోహిత్, నాగరాజు, జాడ కమలాకర్, నీసార్ అహ్మద్, కరుణాకర్, అఙ్గార్‌అలీ, లవకుమార్, గుండ రాజేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

**రెండు దశాబ్దాల కాంట్రిబ్యూషన్‌పై స్పష్టత ఏది?**

సీపీఎస్ కింద గత రెండు దశాబ్దాలుగా ఉద్యోగుల నుంచి సేకరించిన కాంట్రిబ్యూషన్లపై ప్రభుత్వం స్పష్టమైన విధాన నిర్ణయం ప్రకటించాలని నాయకులు కోరారు. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడే విధంగా వారి కాంట్రిబ్యూషన్లకు సంబంధించిన ఖాతాలు, భవిష్యత్ ప్రయోజనాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టంలోని నిబంధనలను ఉద్యోగుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్చేందుకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. 2004 తర్వాత ప్రభుత్వ సేవలో చేరిన ఉద్యోగులందరికీ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని స్పష్టం చేశారు.




# శిరీష హత్యపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

- నిందితునుకి ఉరిశిక్ష వేయాలి
- ఆస్పత్రి పాత్రపై విచారణ జరిపి బాధ్యులని కఠినంగా శిక్షించాలి.
- తెలంగాణ వనవాసి ప్రముఖ్ కాయం నవేంద్ర

**రాజేంద్రనగర్ మహా;** ఆదివాసీ మహిళ శిరీష దారుణ హత్య ఘటనపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా, వేగవంతంగా దర్యాప్తు చేపట్టి పూర్తి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శంషాబాద్ జిల్లా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏబీవీపీ తెలంగాణ వనవాసి ప్రముఖ్ కాయం నవేంద్ర తో కలిసి ర్యాలీగా బయలుదేరి శంషాబాద్ జోన్ డిసిపి కార్యాలయంలో సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. నవేంద్ర మాట్లాడుతూ కేసులో నిందితుడిగా పేర్కొంటున్న శానాద్ ఉల్లా ఖాన్‌పై సాక్ష్యాధారాల ఆధారంగా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎలాంటి రాజకీయ, సామాజిక ఇతర ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాత దర్యాప్తు జరిపి, కేసుకు సంబంధించిన అన్ని సాక్ష్యాలను భద్రపరచాలని డిమాండ్ చేశారు. కేసులోని సాక్షులు, బాధిత కుటుంబ సభ్యులకు అవసరమైన భద్రత కల్పించాలన్నారు. దర్యాప్తును కాలయాపన లేకుండా పూర్తి చేసి, నిందితుడుకి చట్టం ప్రకారం కఠినమైన శిక్ష పడేలా న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఘటనకు సంబంధించి ప్రైమ్ కేర్ హాస్పిటల్ పాత్రపై సమగ్ర విచారణ చేపట్టి, ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది నిర్లక్ష్యం, ఉన్నట్లు తేలితే వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత ప్రాంతాల్లో మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కోటి ప్రదీప్, జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్, ప్రాంత వనవాసి కో కన్వీనర్ రాజేష్,మహేశ్వరం నగర కార్యదర్శి ప్రణీత్, శంషాబాద్ నగర ఉప అధ్యక్షులు క్రిష్,తరుణ్,సంయుక్త కార్యదర్శులు,రోహిత్, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఉచిత అల్పాహారం

రాజేంద్రనగర్: కాటేదాన్ డివిజన్‌లోని గణేష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహార పథకాన్ని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. పేద విద్యార్థులకు పోషకాహారం అందించి, చదువుపై ఆసక్తి పెంచడమే పథకం లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చేవెళ్లలో విద్యార్థుల గళం..!

- హాస్టల్ నిర్మాణంలో ఆలస్యం
- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముందు ధర్నా
- ప్రభుత్వ తీరుపై నిరసన
- డిమాండ్లు నెరవేర్చకపోతే నిరవధిక దీక్షలు: ఎస్ఎఫ్ఐ హెచ్చరిక




**చేవెళ్ల సెప్టెంబర్ 1 మహా**: చేవెళ్ల ప్రాంతంలో విద్యార్థుల వసతి గృహాల నిర్మాణంలో జరుగుతున్న తీవ్ర ఆలస్యంపై ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని నినాదాలతో ప్రాంగణాన్ని మార్మోగించారు. "విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు", "వెంటనే హాస్టల్ నిర్మాణం ప్రారంభించాలి" అంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, కార్యదర్శి బేగరీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. 2018 సంవత్సరంలోనే ఎస్సీ బాలుర, బాలికల కళాశాల వసతి గృహాలు మంజూరు అయినప్పటికీ ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. "ఒక్క ఇటుక కూడా వేయకపోవడం విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనం" అని విమర్శించారు.ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులు సరైన వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని, అద్దె ఇళ్లలో ఉండాల్సి వస్తోందని తెలిపారు. అద్దె గృహాల్లో మౌలిక సదుపాయాల లేమి, భద్రత సమస్యలు, చదువుకు అనుకూల వాతావరణం లేకపోవడం వల్ల విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేద, ఎస్సీ వర్గాలకు చెందిన విద్యార్థులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

**ఎంతకాలం నిర్లక్ష్యం కొనసాగుతుంది?...**

చేవెళ్ల ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ సమస్యపై స్పందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఎన్నోసార్లు అధికారులను కలసి విన్నవించినప్పటికీ సమస్యను పట్టించుకోలేదని మండిపడ్డారు. "విద్యార్థుల సమస్యలపై ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదు? ఇంకా ఎంతకాలం నిర్లక్ష్యం కొనసాగుతుంది?" అని ప్రశ్నించారు. వెంటనే వసతి గృహాల నిర్మాణాన్ని ప్రారంభించి, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉద్ధృతం చేసి రోడ్డు దిగ్బంధాలు, భారీ నిరసనలు, చివరికి నిరవధిక నిరాహార దీక్షలకు కూడా దిగుతామని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, విద్యార్థి నాయకులు, పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నిరంకుశ పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

- ప్రజా పరిపాలన కాదు ఇది వెయ్యి రోజుల రాక్షస పాలన
- వరంగల్ లో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ శ్రేణులు
- పోలీసులకు బిజెపి నాయకుల మధ్య తోపులాట అరెస్ట్, విడుదల



**వరంగల్, బ్యూరో మహా** : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజా ప్రభుత్వం పేరిట నిరంకుశ పాలన కొనసాగిస్తుందని వరంగల్ జిల్లా బిజెపి శ్రేణులు మండిపడ్డారు. ముఖ్యంగా ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ప్రతిపక్షాల పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు, సాగిస్తున్న అరాచకాలకు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ చౌరస్తాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు ఆదేశాల ప్రకారం వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పిలుపు మేరకు, జిల్లా బీజేపీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ శ్రేణుల పై, రాష్ట్ర పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ గుండాలు చేస్తున్న దాడులు, వారి నిరంకుశ పనితీరును తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అరాచకాలను చూస్తూ ఊరుకునేది లేదని, ప్రజల పక్షాన బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. గుండా రాజకీయాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పోలీసులకు బిజెపి శ్రేణులకు మధ్య వాగ్వివాదం తో పాటు తోపులాట జరిగింది. అనంతరం కొంతమంది బిజెపి రాష్ట్ర నాయకులను పోలీసులు అరెస్టు చేసిన అనంతరం వారి సొంత పూచీకత్తు పై విడుదల చేశారు.



# కేత రమణారావుకు రూ.66 వేల సీఎం ఆర్ఎఫ్ సాయం

**రెండు చెక్కులు అందజేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

మణుగూరు, మహా : ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు చేయించుకునే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) భరోసాగా నిలుస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండలం శేషగిరినగర్‌కు చెందిన కేత రమణారావుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.66 వేల విలువైన రెండు చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య చికిత్సలకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అర్హులైన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారు కేత రమణారావు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆచరణాత్మక విద్య అందించాలి

- సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించాలి
- విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వంద శాతం ఉండాలి
- పాఠశాల తనిఖీలో కలెక్టర్ భవేష్ మిశ్రా వెల్లడి



**నిర్మల్ మహా** : పుస్తక పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మక విద్యను అందించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మంగళవారం తానూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.తరగతి గదులు, వసతిగృహం, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వంద శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన సిలబస్, మిగిలిన పాఠ్యాంశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా సిలబస్ పూర్తి చేసి, పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే గుర్తించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.పదో తరగతి విద్యార్థినులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. పాఠశాలలో అందుతున్న వసతులు, భోజనం నాణ్యత, చదువులో ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోర్డు మీద గణిత లెక్కలు రాయించి విద్యార్థినుల సామర్థ్యాన్ని పరిశీలించారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థినులను అభినందించి పెన్నులను బహుమతిగా అందించారు. పరీక్షల గురించి ఆందోళన చెందకుండా రోజువారీ చదువుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. పాఠ్యాంశాల్లో సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి వెంటనే నివృత్తి చేసుకోవాలని, అర్థం చేసుకుని చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థినులకు సూచించారు.అంతకుముందు తానూరు మండలం మొగిలి గ్రామంలోని విఠలేశ్వర ఆలయ ప్రాంగణంలో పీఏసీఎల్ భూ బాధిత రైతులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమ భూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. బాధిత రైతుల నుంచి పూర్తి వివరాలను సేకరించి, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, జీపీవోల ద్వారా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే సంబంధిత భూములకు సమగ్ర సర్వే నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యలు ఉన్న గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి బాధితుల నుంచి వివరాలు తెలుసుకుని, సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని కలెక్టర్ చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.మొగిలి గ్రామంలో రోడ్ల మరమ్మతులకు సంబంధించి గ్రామస్థులు అందించిన వినతిని కలెక్టర్ స్వీకరించారు. సమస్యను పరిశీలించి త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం విఠలేశ్వర ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ మహేందర్‌నాథ్, ఎంపీడీవో శ్రీధర్, ఏఎంసీ ఛైర్మన్ షిండే ఆనంద్‌రావు పటేల్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, సర్పంచ్ ఉష, ఉపసర్పంచ్ నితిన్, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు ఏరియాలో రూ.164 శాతం ఉత్పత్తి..

- ఆగస్టులో 82 శాతం లక్ష్యం సాధించిన సింగరేణి
- 10.33 లక్షల టన్నుల బొగ్గు రవాణా
- కార్మికుల సంక్షేమానికి పెద్దపీట
- ఏరియా జీఎం రామచందర్




**మణుగూరు, మహా** : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆగస్టు నెలలో బొగ్గు ఉత్పత్తి, రవాణాతో పాటు ఓవర్‌బర్డెన్ తొలగింపులోనూ గణనీయమైన ప్రగతి సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఆగస్టు నెలకు సంబంధించిన ఉత్పత్తి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఆగస్టు నెలలో మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 6.28 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 10.33 లక్షల టన్నులు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. దీంతో రూ.164 శాతం ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 31 వరకు నిర్దేశించిన 38.39 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 52.77 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి రూ.137 కోట్ల మేర ప్రగతి సాధించినట్లు వివరించారు. అదేవిధంగా ఆగస్టులో 10.33 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 53.38 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 53.85 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు వెల్లడించారు. ఓవర్‌బర్డెన్ తొలగింపులో ఆగస్టు నెలలో 10 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి 106 శాతంతో 10.56 లక్షల క్యూబిక్ మీటర్లు సాధించినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 54 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి 44.28 లక్షల క్యూబిక్ మీటర్లు తొలగించి 82 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆగస్టు నెలలో సీఎంపిఎఫ్, పెన్షన్‌కు సంబంధించి 7 కేసులు, గ్రాట్యుటీ 16, ఎఫ్ బి ఐ ఎస్ (డి) ఒకటి, ఎఫ్ బి ఐ ఎస్ అక్యుములేషన్స్ 25, హెచ్.బి.ఆర్.ఎస్ 7 కేసులు పరిష్కరించారు. ఇప్పటివరకు 4,428 సిపిఆర్ఎంఎస్ కార్డులు జారీ చేయగా, 4,221 కార్డులను రెన్యువల్ చేశారు. కొత్తగా ఆరు సిపిఆర్ఎంఎస్ఎన్ఈ సభ్యత్వ కార్డులు జారీ చేశారు. కారుణ్య నియామకాలకు సంబంధించి 11 ఓ ఎస్ ఎల్ లను కార్పొరేట్ కార్యాలయానికి పంపగా, ఐదుగురికి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 కన్ఫర్మేషన్లు, 17 క్యాడర్ కేసులను పరిష్కరించారు. ఈ సమావేశంలో ఏరియా ఎస్ఓ టు జీఎం డి. వెంకట రామారావు, పీకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్. రమేష్, మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఇ. శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) కె. బి. హెచ్. ప్రసాద్, డీజీఎం (సివిల్) జె. శ్రీనివాసరావు, పర్యావరణ అధికారి కె. శ్రీనివాస్ రావు, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ కె. స్వప్న, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ ఎస్. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరపాలి


- పట్టణంలో ఎస్పీ ప్రత్యేక సమావేశం
- నిర్వాహకులకు పలు సూచనలు



**ఆదిలాబాద్ మహా** : ఆదిలాబాద్ జిల్లాలో రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం మున్సిపల్ ఛైర్పర్సన్ బండారి అనూష, నిర్వహక కమిటీ సభ్యులు , హిందూ ఉత్సవ సమితి సభ్యులు, స్థానిక కౌన్సిలర్లు, నాయకులతో కలిసి స్థానిక తానిషా గార్డెన్ లో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సంస్కృతి , సాంప్రదాయాన్ని కాపాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని ఎస్పీ అన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ కలిసిమెలిసి నిర్వహించుకోవాలని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు.త్వరలో ఆన్లైన్లో వచ్చే లింకు ద్వారా ప్రతి ఒక్క గణపతి మండపం రిజిస్ట్రేషన్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దీంతో బందోబస్తు కేటాయించవలసిన పోలీసు సిబ్బంది ని నియమించవచ్చన్నారు. నిమజ్జనం లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామాలలో సాధ్యమైనంతవరకు ఒకే గణపతి మండపం ఏర్పాటు చేసే విధంగా సహకరించాలన్నారు. గతంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని, నూతనంగా ఏర్పాటు చేసే వారికి అనుమతులు లేవని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1000 మంది మండప నిర్వాహకులతో పాటు ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్ర వర్ధన్, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, బీడీ ప్రేమ్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్లు జి శ్రావణ్, సిహెచ్ రమేష్, కే నరేష్, ఎం ప్రసాద్, డి గురుస్వామి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి,ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు సిబ్బంది, హిందు ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు బొంపల్లి హనుమన్లు, నూతన అధ్యక్షుడు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాటు కోళ్ల పేరిట వ్యాపారుల భారీ మోసం

- 180 నుంచి 250 రూపాయలకు కొనుగోలు
- 700 కు అమ్మకాలు
- కలర్ ఫామ్ కోళ్లనే నాటు కోళ్లు అంటూ వ్యాపారుల దందా
- అమాయక ప్రజల జేబులకు చిల్లులు...ప్రేక్షక పాత్రలో మునిసిపల్, ఫుడ్ సేఫ్టీ అధికారులు




**మంచిర్యాల, మహా :** నాటు కోళ్ల పేరిట చికెన్ సెంటర్ వ్యాపారులు జిల్లా వ్యాప్తంగా అమాయక ప్రజలను భారీ మోసానికి గురి చేస్తున్నారు. స్థానిక షెడ్లలో కలర్ ఫుల్ కోళ్లను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి కేవలం మూడు నెలలలో చికెన్ సెంటర్ వ్యాపారులకు విక్రయాలు జరుపుతున్నారు. ఈ ఫామ్ నుండి నేరుగా చికెన్ సెంటర్ వ్యాపారులకు మధ్యవర్తి ద్వారా 180 రూపాయల నుంచి 250 అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం. ఇలా కొనుగోలు చేసిన కోళ్లను చికెన్ సెంటర్ వ్యాపారులు 700 రూపాయలకు బహిరంగ మార్కెట్లో అమ్మకాలు జరుపుతూ అమాయక ప్రజలను మోసం చేస్తూ వ్యాపారులు లబ్ధి పొందుతున్నారు అని తెలుస్తోంది.* దీనిపై మహా దినపత్రిక ప్రత్యేక కథనం....నాటు కోడి కూర అంటే అందరికీ ఇష్టం. కానీ ఆ పేరుతో మార్కెట్లో జరుగుతున్న మోసం మాత్రం ఎవరికీ పూర్తిగా అర్థం కావడం లేదు. చికెన్ సెంటర్ల నిర్వాహకులు ఫామ్ లో పెంచిన గిరి రాజా, స్వమంద్ర, వివిధ రంగుల కలప రోస్టర్లు వంటివి కలర్ బ్రాయిలర్ కోళ్ల బహిరంగ మార్కెట్లోకి వేగంగా వస్తున్నాయి. వీటిని వ్యాపారులు ఒరిజినల్ నాటు కోళ్లు అంటూ అధిక ధరకు ప్రజలకు అమ్మి మోసం చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్ర వెల్లువెత్తుతున్నాయి.

**ఎలా జరుగుతోంది దందా..?**

నాటు కోళ్ల పిల్లల పేరిట ఫీడు పిల్లలను తెచ్చి షెడ్లలో పెంచుతున్నట్లు సమాచారం. 90 రోజుల్లో పెరిగే ఆ కోళ్లను 100 శాతం నాటు కోడి అని బోర్డులు పెట్టి విక్రయిస్తున్నారు. ఫామ్ కోడి ధర కేజీ 180 నుండి 250 రూపాయలు మాత్రమే. కానీ వ్యాపారులు దాన్నే 700 రూపాయలకు కేజీ చొప్పున అమ్ముతున్నారు. అంటే కేజీకి 450 రూపాయల అదనపు లాభం అన్నమాట.

**అధికారులు స్పందించాలి**

ఈ అక్రమ వ్యాపారంపై మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే దాడులు చేసి కట్టడి చేయాలని వినియోగదారుల సంఘాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ధరల జాబితా, కోడి రకం తప్పనిసరిగా చికెన్ సెంటర్ల యజమానులు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**నిపుణులు చెప్పేది ఏంటంటే**

నిజమైన నాటు కోడి బరువు తక్కువగా ఉంటుంది, కాళ్లు సన్నగా, ఈకలు గట్టిగా ఉంటాయి. అలాగే రకరకాల రంగుల ఈకలు కలిగి ఉంటుంది. ఈ కోడి కిలో కంటే ఎక్కువ బరువు రావాలంటే 6 నెలలు నుండి 1 సంవత్సరం వయస్సు కావలసి ఉంటుంది. ఇలాంటి నాటు కోడికి ధర కూడా కేజీ 500600 ఉండవచ్చు. కానీ 90 రోజుల ఫామ్ కోడిని స్వచ్ఛమైన నాటు కోడి అని వ్యాపారులు ప్రజలను నమ్మిస్తూ పూర్తిగా మోసం చేస్తున్నారని తెలుస్తోంది.

**ప్రజలు నష్టపోతున్నారు**

ఈమధ్య చాలామంది వయసు మీరిన స్త్రీ పురుషులకు బి12 విటమిన్ లోపం ఉన్నట్లు వెల్లడవుతుంది. అయితే ఈ బి 12 పోషకాలు నాటు కోడిలో పుష్కలంగా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నాటు కోడి రుచి, పోషకాలు కావాలని ఎక్కువ డబ్బు పెట్టి కొనే అమాయక ప్రజల జేబులకు చిల్లు పడుతోంది. నిజమైన నాటు కోడి దొరకడం కష్టమైపోతోంది.



# సక్రమంగా విధులు నిర్వర్తించకుంటే చర్యలు

- ఏకలవ్య స్కూల్ ను తనిఖీ చేసిన కలెక్టర్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా** : సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించకుంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్కడున్న సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ లో నిల్వ కుళ్ళిన వంట పదార్థాలపై క్యాటరింగ్ అసిస్టెంట్ పై కలెక్టర్ అగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ అంకిత్ పాఠశాల ఆవరణలో ఉన్న డైనింగ్ హాలులో వంట వండుతున్న కుకింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన వంటకాలను అన్నం పప్పు సాంబార్ రసం పెరుగు కోడిగుడ్లను రాత్రి భోజనం కోసం వంట చేసేందుకు సిద్ధం చేసుకున్న కాయగూరలను పరిశీలించి కుకింగ్ చేసే వంట మనిషితో హెల్పర్లతో మాట్లాడారు. ఎన్ని సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నారని నాణ్యతతో కూడిన పౌష్టికాహారం విద్యార్థులకు సిద్ధం చేసి అందజేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అప్పుడే విద్యార్థులతో పాటు పాఠశాల ఆవరణ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.అదేవిధంగా డైనింగ్ హాల్ లో ఉన్న స్టోర్ రూమ్, ఆర్.ఓ.ఆర్ ప్లాంట్ ప్రాంతాలను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్ లో ఉన్న కాయగూరలు ఉల్లిగడ్డ నిల్వ ఉన్న పప్పు దినుసులు బియ్యం సబ్బులు సరపు షాంపులు తదితర సామాగ్రిని ఎప్పుడు కొనుగోలుచేశారని ఎంతకాలం నుంచి నిల్వ ఉంచుతారని క్యాటరింగ్ అసిస్టెంట్ మంగీలాల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో నిల్వ ఉన్న బెల్లం కుళ్ళి ఉండడాన్ని పరిశీలించి క్యాటరింగ్ అసిస్టెంట్ పై ఆగ్రహం వ్యక్తం చేసి సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏకలవ్య పాఠశాలలో వాచ్మెన్ గా పనిచేస్తున్న సుజాత తన సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళింది. విధులు నిర్వహించాలంటే సెక్యూరిటీ రూమ్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని సెక్యూరిటీ రూమ్ నిర్మించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా పాఠశాలకు రావాలంటే విద్యార్థులు ఉపాధ్యాయ సిబ్బంది సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని అంతర్గత రోడ్లు పరిస్థితి మరీ దారుణమని పలు సమస్యలు జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట కొత్తగూడెం తహసిల్దార్ పుల్లయ్య, రెవెన్యూ సిబ్బంది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్





**భద్రాద్రి కొత్తగూడెం, మహా**:గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ సమావేశపు హాలులో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై సమావేశం జరిగింది. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని గణేష్ మండపాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలని ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు మండల స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీస్ రెవెన్యూ ఇతర శాఖల అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు నుండి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.మండపాలకు విద్యుత్ ఏర్పాటుకు తప్పని సరిగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలుపై విద్యుత్ అధికారులు మండపాల్లో ఆడిట్ నిర్వహించాలని సూచించారు. విద్యుత్ తీగలకు తగల కుండా ఎత్తు తక్కువ ఉండే విగ్రహాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మండపాల్లో మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని తెలిపారు. భద్రాద్రి జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాలు జిల్లాల నుండి నిమజ్జనానికి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున యంత్రాంగం సూచించిన ప్రాంతాల్లో మాత్రమే అత్యంత భద్రత మధ్య నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలియజేసారు. గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళికరూపొందించుకోవాలని విగ్రహాలను నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను కోరారు. నిమజ్జనం రూట్ లో అవసరమైన రోడ్డు మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణాశాఖ అధికారి నుండి ధ్రువీకరణ తీసుకోవాలన్నారు.

ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన మేర బందోబస్తు ఏర్పాటు చేయాలని గణేష్ నిమజ్జనం సజావుగా జరిగే విధంగా కట్టు దిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తిపాటలు మాత్రమే వినిపించాలని మతాలు వర్గాల మనోభావాలను గౌరవించాలని పేర్కొన్నారు. అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని గణేష్ ఉత్సవాలు నిమజ్జనం సందర్భంగా ఎలాంటి రెచ్చగొట్టే అంశాల జోలికి వెళ్లవద్దని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా క్రేన్లు వినియోగించాలని గణేష్ నిమజ్జనం జరిగే ప్రదేశాలలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సహకారంతో కలిసికట్టుగా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అన్నారు. భక్తులకు అందించే స్వామి వారి ప్రసాదాలకు ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని తెలిపారు. వ్యర్థాలు వేసేందుకు డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని రసాయనాలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసే విగ్రహాలు పర్యావణానికి హాని కలిగిస్తాయన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఉచిత మట్టిగణపతులు పంపిణీ చేయనున్నామని ప్రజలు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, డీ.ఆర్.ఓ పద్మావతి, డీ.టీ.ఓ వెంకట రమణ, జిల్లా ఇంచార్జ్ ఎక్సైజ్ ఈ.ఎస్ జానయ్య, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ తుకారాం రాథోడ్, విద్యుత్ శాఖ ఎస్.ఈ మహేంద్ర, కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ సుజాత, ఐటీసీ, సింగరేణి సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యెర్రా కామేష్, సభ్యులు దారా రమేష్, లక్ష్మణ్, వందనపు శ్రీధర్, మహేష్, సుజాత, విజయలక్ష్మి, యాకయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పదివేల ఆర్థిక సాయం

**మందమర్రి, మహా:** మందమర్రి మున్సిపాలిటీ 19వ వార్డులో ఇటీవల మృతి చెందిన సుంకరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు మంగళవారం చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద పంపించిన పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పట్టణ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి బృందం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుతుకు సుదర్శన్, కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, ఎండి ఆఫీజ్, ఆకారం రమేష్, మంకు రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బుర్ర ఆంజనేయులు, కార్యదర్శి కత్తి రమేష్, ఉపాధ్యక్షులు మాయ తిరుపతి, పట్టణ మీడియా కమ్యూనికేషన్ ఇంచార్జి చిప్పకుర్తి శశిధర్ తదితరులు ఉన్నారు.

## రహదారుల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దు

**వరంగల్, మహా:** గ్రేటర్ వరంగల్ నగరంలోని ప్రధాన రహదారులు, డివైడర్లు, కూడళ్లలో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న హెచ్చరించారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన పారిశుధ్య పరిస్థితులపై అసహనం వ్యక్తం చేశారు. డివైడర్లపై చెత్త, మట్టి, ఎండిన ఆకులు, చెట్ల కొమ్మలు పేరుకుపోకుండా నిత్యం శుభ్రం చేయాలని ఆదేశించారు. సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే బాధ్యత నిర్ధారించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం లక్ష్మీపురం మార్కెట్ లో ఏర్పాటు చేయనున్న 5 టీపీడీ సామర్థ్యం గల కంప్రెస్డ్ బయోమిథనైజేషన్ ప్లాంట్‌ను పరిశీలించి పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.





# రాహుల్ పై కేసు..రాజకీయ కక్షసాధింపే

- దళితుల హక్కుల కోసం మాట్లాడితే కేసులా?
- ప్రజా సమస్యలు పట్టవు.. ప్రతిపక్షాలపై కేసులా?
- ప్రశ్నించే గొంతును అణచలేరు.. కాంగ్రెస్ పోరాటం ఆగదు
- రాహుల్‌పై కేసు వెంటనే ఉపసంహరించాలి: మంత్రి జూపల్లి




**నాగర్‌కర్నూల్, మహా** : కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రాహుల్‌గాంధీపై అక్రమంగా, రాజకీయ కక్షతో కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ అనంతరం ప్రాంగణ శుద్ధీకరణ అవమానకర ఘటనపై ప్రశ్నించినందుకే రాహుల్‌పై కేసు పెట్టడం దుర్మార్గమన్నారు.దళితుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం రాహుల్‌గాంధీ మాట్లాడారని మంత్రి తెలిపారు. రాహుల్‌గాంధీ స్వయంగా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేయగా.. ఆయనపైనే అదే చట్టం కింద కేసు పెట్టడం బీజేపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. దళితులపై వివక్షకు వ్యతిరేకంగా మాట్లాడటం నేరమా? రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం కోసం ప్రశ్నించినందుకు కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలను వెంటనే నిలిపివేయాలని, రాహుల్‌గాంధీపై నమోదు చేసిన కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని జూపల్లి ఆరోపించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా.. ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టి రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోరాటాలతోనే కార్మిక వర్గానికి మనుగడ






**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: సంఘటిత పోరాటాలతోనే కార్మిక వర్గానికి మనుగడని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్ టియు) జాతీయ ఉపాధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.అనురాధలు అన్నారు.మంగళవారం సిఈఆర్ క్లబ్ లో ఐఎఫ్ టియు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగ పాణి అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సులో సాధినేని, అనురాధలు మాట్లాడుతూ కార్మికులు చేసిన ఎన్నెన్నో పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేవలం అంబానీ అదాని లాంటి కార్పొరేట్ సంస్థలు కార్మికుల రక్త మాంసాలను జుర్రుకునేందుకు వారి సంపదలను పెంచేందుకు నాలుగు లేబర్ కోడ్లను తీసుకుని వచ్చారన్నారు. నాలుగు లేబర్ కోడ్లు దేశ కార్మికవర్గం మనుగడకు ఉరితాడు లాంటివని అన్నారు.29 కార్మికచట్టాల రద్దు దాని స్థానంలో తెచ్చిన లేబర్ కోడ్లు కార్పొరేట్లకు కార్మిక వర్గాన్ని తాకట్టు పెట్టడమేనని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు సంఘటిత పోరా టాలు చేయాలని అన్నారు. మోడి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై డిల్లీ గురుగావ్, నోయిడా, మానేసర్ లో ప్రారంభమై ఉత్తర ప్రదేశ్, హర్యానా, బీహార్, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో నాలుగు లేబర్ కోడ్లపై కార్మికవర్గం చేసిన వీరోచిత ఉద్యమాలను స్ఫూర్తిగా చేసుకొని దేశ కార్మిక వర్గం పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి జే.సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అసంఘటితరంగ సంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని అన్నారు. మున్సిపల్, జీపి అంగన్వాడి ఆశా కేజీబివి భవననిర్మాణ స్కీం ఆటో మోటార్ సింగరేణి విద్యుత్ బిపిఎల్ నవభారత్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి కడుదుర్మార్గంగా ఉందని అన్నారు. కనీస వేత నాలు చట్టబద్ధ సౌకర్యాలు అమలుకు నోచుకోవడం లేదని పనిస్థలాల్లో కనీస రక్షణ చర్యలులేవని మహిళా కార్మికులపై లైంగిక వేధింపులు జరుగుతున్నప్పటికీ రాజకీయ నేతల అండదండలతో నేరస్థులు కాపాడబడు తున్నారని అన్నారు. సదస్సులో ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఎండి.రాసుద్దిన్, తోడేటి నాగేశ్వరరావు, గౌనినాగేశ్వరరావు, ఎన్.సంజీవ్, కొండపల్లి శ్రీనివాస్, మోత్కూరి మల్లికార్జున్, బి.వెంకటమ్మ తదితరులు ప్రసంగించారు.

**కార్మిక ప్రదర్శన**
సదస్సు అనంతరం సి ఈఆర్ క్లబ్ నుండి పోస్టాఫీస్ సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు కార్మికుల ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు కాపుకృష్ణ, జి.సంజీవరావు, వాసు, శరత్, మంకెన వెంకటేశ్వర్లు, రాపూరి ఉపేందర్ రావు, మోహన్ రావు, నర సింహారావు, సామెల్, కొప్పులశ్రీనివాస్, యాసారపువెంకన్న, గడ్డంనాగేష్, పందిళ్ళపల్లి వీరన్న, సాధనపల్లి రవి సానుగుల వెంకన్న, మూడుబిచ్చు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**39 మంది లబ్ధిదారులకు రూ.11.59 లక్షల విలువైన చెక్కులు పంపిణీ**



**సత్తుపల్లి, సెప్టెంబర్ 1: మహా** : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మంగళవారం పెనుబల్లి మండలం వీఎం బంజర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 39 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.11,59,500 విలువైన చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను ఎండగడతాం

**వరంగల్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేసిన వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జాప్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో విస్తృత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ తెలిపారు. మంగళవారం రాజశ్రీ గార్డెన్స్‌లో నియోజకవర్గ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రదేశాలు, డివిజన్లలో ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవాలని నిర్ణయించారు. ప్రతి డివిజన్‌లో ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రజల తరఫున పోరాటం చేస్తామని నరేందర్ తెలిపారు

## మాదకద్రవ్యాల నివారణ, అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, కలెక్టరేట్ మహా** :వరంగల్ జిల్లాలో నార్కోటిక్ కేసుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి నార్కోటిక్ నియంత్రణ సమావేశం నిర్వహించి, జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.

ఈ సమావేశానికి పోలీస్, ఎక్సైజ్, రవాణా, వైద్య ఆరోగ్య, విద్య, సంక్షేమ శాఖల అధికారులు హాజరయ్యారు. జిల్లాలో నమోదవుతున్న నార్కోటిక్ కేసులు, మాదకద్రవ్యాల సరఫరా నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరిగే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.సరిహద్దు ప్రాంతాలు, రవాణా కేంద్రాలు, అనుమానాస్పద ప్రదేశాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు.మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, వినియోగానికి పాల్పడే వ్యక్తుల పై కఠినంగా చర్యలు తీసుకోవాలని పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు.నార్కోటిక్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులకు శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలు సేకరించాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ల లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులు, యువతను చైతన్యపరచాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగానికి బానిసైన వారికి అవసరమైన వైద్య, పునరావాస సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**నియంత్రణ పై ప్రజల్లో అవగాహన**
నార్కోటిక్ నియంత్రణ పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించవల్సిందే!

- జేఏసీ చైర్మన్ యశ్వంత్, కన్వీనర్ డా.రామారావు
- ఐడిఓసి, కొంగరకలాన్ లో నిరసన చేపట్టిన జేఏసీ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**:తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి టీజీఈజేఏసీ, రంగారెడ్డి జిల్లా తరపున, మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఐడిఓసి, కొంగరకలాన్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించడము జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో ఐడిఓసి కొంగరకలాన్ లో సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని ఉద్యోగ నాయకులు మాట్లాడారు. ఈ సందర్బంగా టీజీఈజేఏసీ రంగారెడ్డి జిల్లా చైర్మన్ యశ్వంత్ మాట్లాడుతూ.. సిపిఎస్ అనేది ఉద్యోగస్తుల పట్ల శాపంగా మారిందని సిపిఎస్ ను వెంటనే రద్దుచేయాలని. రాష్ట్ర ఉద్యోగ జేఏసీ కార్యాచరణలో భాగంగా 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ఉద్యోగస్తులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా టీజీఈజేఏసీ కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ... సిపిఎస్ అనేది చాలా ప్రమాధకరమైనదని ఇప్పుడున్న ప్రభుత్వం అధికారములోకి వచ్చిన 6 మాసాలలో సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు దాటవేసే ధోరణి కరెక్ట్ కాదని వెంటనే OPS ను పునరుద్ధరణ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాలుగవ తరగతి ఉద్యోగులు, కార్మికులు మరియు పెన్షనర్లు అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి, తమ సంపూర్ణ మద్దతును తెలియజేసారు. ఓపిఎస్ పునరుద్ధరణ కోసం మనమంతా ఐక్యంగా నిలబడి, మన గొంతును బలంగా వినిపిద్దాం అందరు కోరారు.. ఈ కార్యక్రమం లో జిల్లా కో కన్వినర్ శ్రీనేష్ కుమార్ నోరి, కో చైర్మన్లు గోపాల్, ప్రవీణ్, శాంతి శ్రీ, సుధాకర్,రాజేష్, బల్వంత్ రెడ్డి,వైస్ చైర్మన్లు నూతన కంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, సెక్రెటరీలు , మాధవ్ , ఆనంద్, మహేష్, ప్రమీల,వెంకటప్ప,పాండు రంగా రెడ్డి, కల్పన, జగన్నాథ్ శర్మ,అరుణ,గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మతల్లి సేవలో డిప్యూటీ

# సీఎం మల్లు భట్టి విక్రమార్క...

- ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని
- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలలి: డిప్యూటీ సీఎం
- మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు కృషి



**తుక్కుగూడ సెప్టెంబర్ 01 మహా**: రావిర్యాల గ్రామం సూర్యగిరి ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. మంగళవారం మహేశ్వరం మండలం, శంVVషాబాద్ సర్కిల్ తుక్కుగూడ డివిజన్ రావిర్యాల గ్రామం సూర్యగిరి ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొన్నారు. సూర్యగిరి ఎల్లమ్మ తల్లి సన్నిధిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ... ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఈ సందర్భంగా అమ్మవారిని కోరినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు తెలంగాణలో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉంది. గ్రామదేవతగా ఎల్లమ్మ తల్లిని కొలిచే భక్తుల విశ్వాసం తరతరాలుగా కొనసాగుతోంది...ప్రజల విశ్వాసాలకు, మన సంప్రదాయాలకు గౌరవం ఇస్తూ ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. కేఎల్ఆర్ మాట్లాడుతూ... రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని, ప్రజా సంక్షేమం మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, ఆరోగ్యం, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఎల్లమ్మ తల్లిని ప్రార్థిస్తున్నాము. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరికీ శాంతి, సంతోషం, సుభిక్షం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.



## ట్రాఫిక్ రద్దీ నివారణకు చర్యలు

**హనుమకొండ, మహా:** హనుమకొండ నగరంలోని హంటర్ రోడ్డులో అదాలత్ జంక్షన్ నుంచి నీలిమ జంక్షన్ వరకు పాఠశాలలు, కళాశాలలు అధికంగా ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు,వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీతో పాటు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఆర్అండ్‌బీ అధికారులు ప్రాంతాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరిచేందుకు న్యూ సైన్స్ కాలేజీకి కొంత దూరంలో ఉన్న మీడియన్ కటింగ్‌ను ఈ నెల 4వ తేదీ నుంచి తాత్కాలికంగా, ప్రయోగాత్మక ప్రాతిపదికన మూసివేయనున్నారు. వాహనదారులు ఈ మార్పును గమనించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ కోరారు. ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.




# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.!

- ఉద్యోగ ఆరోగ్య పథకాన్ని మెరుగుపరచాలి..
- సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినం!
- టిజిసిటిఏ ఓయూ సెక్రెటరీ డాక్టర్ చింతల రాకేష్ భవాని
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 1 మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ హరించిన సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా భావిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి పాత పెన్షన్ ఆవశ్యకతను తెలియజేస్తూ కళాశాల ఆవరణలో నినాదాలతో శాంతియుతంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మరియు టిజిసిటిఏ ఓయూ సెక్రెటరీ డాక్టర్ చింతల రాకేష్ భవాని మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తెలంగాణ రాష్ట్రంలోని రెండు లక్షల 60 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అందరికీ సిపిఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జార్ఖండ్, ఛత్తీస్గఢ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో కూడా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. మార్కెట్ ఆధారిత పెన్షన్ ఎంత మాత్రం ప్రయోజనం కాదన్నారు. ఉద్యోగి సుదీర్ఘకాలం ప్రభుత్వానికి చేసిన సేవలకు గాను పాత పెన్షన్ తప్పకుండా ఇవ్వాల్సిందే అని పెన్షన్ బిక్ష కాదు హక్కు అని అన్నారు. అంతేకాకుండా పెండింగ్ లో ఉన్న డీఎలను విడుదల చేయాలని రెండవ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగ ఆరోగ్య పథకాన్ని మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సంఘ నాయకులు డాక్టర్ రమేష్, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ డి వి రావు, డిఎస్ఎస్ఆర్ కృష్ణ, డాక్టర్ రచన, డాక్టర్ సురేఖ, డాక్టర్ కరుణ తదితరులు పాల్గొన్నారు.



# నేడు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం

- కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల హామీ లో జాప్యాన్ని నిరసిస్తూ
- బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**బెల్లంపల్లి , ఘహా:** పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రజల గురించిన ఆరోగ్యారెంటీల హామీని నెరవేర్చడం లేదని టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలోని కాంట్రా చౌరస్తా వద్ద ధర్నా నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు . మంగళవారం నాడు బెల్లంపల్లి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు 6 గ్యారెంటీలు, 420 హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి గారు గద్దెనెక్కి 1000 రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి గద్దెనెక్కారు.. 1000 రోజులు గడిచినా హామీల అమలు మాత్రం ఎక్కడ?" అని ప్రశ్నించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు "కాంగ్రెస్ 420 మోసాలపై టిఆర్ఎస్ పోరుబాట" కార్యక్రమంలో భాగంగా ఈనెల రెండవ తేదీ నుండి 8వ తేదీ వరకు నియోజకవర్గంలో చేపట్టాల్సిన నిరసన కార్యక్రమాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగా బుధవారం ఉదయం 10:00 గంటలకు బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలో ధర్నా, బాకీ కార్డుల పంపిణీ, 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు.



# సీఎం రేవంత్ "ప్రజా పాలన" భేష్

- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అద్భుతం
- అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు
- బిఆర్ఎస్ నేతల ఆరోపణలు అర్థరహితం
- డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, కాంగ్రెస్ రాష్ట్ర నేత ఆళ్ల మురళి


భద్రాద్రి కొత్తగూడెం, మహా: సీఎం రేవంత్ రెడ్డి పాలన భేష్‌అని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, కాంగ్రెస్ రాష్ట్ర నేత ఆళ్ల మురళి అన్నారు.

**ఇందిరమ్మ రాజ్యంలోముఖ్యమంత్రి**

రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా పాలన వచ్చి వెయ్యి రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యానగర్ కాలనీలో ఉన్న మంత్రి పొంగిలేటి శీను అన్న క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నీళ్లు నిధులు నియామకాలు దళిత ముఖ్యమంత్రి, 3ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి అంటూ మాయ మాటలతో పది సంవత్సరాలు పాటు కుటుంబ పాలన సాగించి రాష్ట్రాన్ని దోచుకుని దాచుకొని రాష్ట్రాన్నిఅప్పుల కుప్పగా చేసిన ఘన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు 25 లక్షల రైతు కుటుంబాలకు రెండు లక్షల రుణమాఫీ, 12 వేల రైతు భరోసా, రైతులకు ఉచిత కరెంటుతో పాటు వరి ధాన్యంసన్నాలుకు 500 బోనస్, మహిళ సోదరీమణులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. 15 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు సన్నబియ్యం, 55 లక్షల కుటుంబాలుకు 200 యూనిట్లు ఉచిత కరెంటు, 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, ప్రతి నియోజకవర్గానికి 200 కోట్లతో పేద విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఏర్పాటు, 72,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు, 500 కే గ్యాస్ సిలిండర్, కొత్తగా రెండున్నర లక్షల వితంతు ఒంటరి మహిళ దివ్యాంగులకు ఆసరా పెన్షన్స్ మంజూరి, ఇలా దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రం అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రేవంత్ రెడ్డి ప్రభుత్వమని కొనియాడారు. ప్రజా పాలన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు సాగిస్తున్న సుపరిపాలన చూసి ఓర్వలేని బిఆర్ఎస్, బిజెపి, ప్రతిపక్షాలు సూర్యుడిపై ఉమ్మి వేసినట్లుగా ఆరోపణలు చేస్తున్నారని వీరి ఆరోపణలు గాలిలోనే కలిసిపోతాయని ప్రజలు వీరిని నమ్మరని తిరిగి మళ్లీ కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యాన్నే ప్రజలు ఎన్నుకుంటారని జోష్యం చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వై.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మంద హనుమంతు, ఎస్కే జానీ పాషా, కోశాధికారి కొదుమూరి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పైడా రాజేంద్రప్రసాద్ లోశెట్టి నాగార్జున, జిల్లా కార్యదర్శి ఆంతోటి పాలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతలపూడి రాజశేఖర్, మండల అధ్యక్షులు భువన సుందర్ రెడ్డి, నర్రా అజయ్ కుమార్, జేమ్స్, సునీల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రపూర్ రాజశేఖర్, శ్రీనివాసరావు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు వేగంగా అమలు చేయాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ పథకాల అమలులో అధికారులకు జాప్తం వలదని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని తాండూర్ మండలంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని ఆయన పరిశీలించారు. మాదారం గ్రామపంచాయతీని సందర్శించి ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ ప్రక్రియను పరిశీలించి సిబ్బందితో ప్రక్రియ నిర్వహణ వివరాలు తెలుసుకుని, నోటీసుల పంపిణీ, విచారణకు సంబంధించిన పనులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి చేయూత పింఛన్లకు సంబంధించిన పనులు, వ్యక్తిగత మరుగుదొడ్లు తదితర కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఆయా పథకాల కింద చేపడుతున్న పనులు, పెండింగ్ అంశాలు, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేసి, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లు తమ పరిధిలోని పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మండలంలోని బోయపల్లి ప్రీప్రైమరీ పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాల ను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి పఠన సామర్థ్యాలను తెలుసుకున్నారు. బేస్‌లైన్ పరీక్షల ఫలితాలను పరిశీలించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను బట్టి బోధన విధానాలను రూపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బోయపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియను పరిశీలించారు. విచారణకు హాజరైన వారి నుంచి వివరాలు తెలుసుకుని, ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి పారదర్శకంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విచారణ ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఈ పర్యటనలో తహసిల్దార్ జ్యోత్స్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉంది

- బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్

**బెల్లంపల్లి ,మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ పేర్కొన్నారు మంగళవారం నాడు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాలతో బెల్లంపల్లి పట్టణంలోని టేకులబస్తి 15వ వార్డు కౌన్సిలర్ సిహెచ్ .వసంత ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించి మహిళలకు చీరలను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావా స్వాతి రమేష్ బాబు విచ్చేసి మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సాధికారత దిశానిర్దేశం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలే నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. ప్రతి ఆడబిడ్డ జీవితంలో నమ్మకానికి కొత్త వెలుగులు నింపుతున్నాయని ఇందిరమ్మ చీర ఆడబిడ్డకుఆత్మీయ కానుక ఇందిరమ్మ రాజ్యం మహిళకు ఆత్మగౌరవ భరోసా అని వివరించారు.ఇందిరమ్మ చీరల తయారీలో సిరిసిల్ల చేనేత కార్మికుల శ్రమకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మహిళల గౌరవంతో పాటు తెలంగాణ చేనేతకు కూడా ప్రభుత్వం అండగా నిలుస్తోందనీ,ఆడబిడ్డకు ఆత్మగౌరవం..మహిళకు ఆర్థిక స్వావలంబన. అని,ఆడబిడ్డను కేవలం లబ్ధిదారుగా కాకుండా కుటుంబ గౌరవానికి, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ప్రతీకగా భావిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో మరో ప్రత్యేక కార్యక్రమమే ఇందిరమ్మ చీరల పంపిణీ అని పేర్కొన్నారు.రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటి చీరలు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు.కార్యక్రమంలో బెల్లంపల్లి అధికార ప్రతినిధి దేవసాని ఆనంద్, మాజీ పట్టణ అధ్యక్షులు కంకటి శ్రీనివాస్, మాజీకౌన్సిలర్ నీలి కృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకులు పోచంపల్లి హరీష్, పట్టణ వైస్ ప్రెసిడెంట్ ఖలీల్, పట్టణ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ దెబ్బేటి రమేష్ నాయకులు కన్నూరి రాజలింగు,మీర్జా ఖదీర్ బేగ్,అంకం రవి,పీక లక్ష్మణ్ , చింతల లోకేష్,బొల్లి వంశీ, గద్దల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు

# పటిష్ఠ చర్యలు చేపట్టాలి

**బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి**

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్, కలెక్టరేట్ మహా** : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశానికి డీసీపీ అంకిత్ కుమార్, తో పాటు సంబంధిత రవాణా పోలీస్, రోడ్లుభవనాలు పంచాయతీ రాజ్ తో పాటు జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు హాజరయ్యారు.జిల్లా వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన తక్షణ చర్యల పై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.ముఖ్యంగా గతంలో గుర్తించిన బ్లాక్ స్పాట్ వల్ల నివారించిన చర్యలు, ముందస్తు ప్రమాదాల నివారణ పై సుదీర్ఘంగా చర్చించారు. ప్రమాదాల తీరును పిపిటి ద్వారా గుర్తించిన బ్లాక్ స్పాట్ నివారించుటకు ఆర్ అండ్ బి ఇ ఇ రాజేందర్ ను అధికారికి సూచించటం హెచ్చరిక బోర్డులు, మెరుగైన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఓవర్ స్పీడ్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి నిబంధనల ఉల్లంఘనల పై కఠినమైన తనిఖీలు చేపట్టాలని పోలీస్, రవాణా శాఖలను కోరారు. స్కూల్ బస్సులు, ప్రజా రవాణా వాహనాల ఫిట్‌నెస్ ను కచ్చితంగా పరిశీలించాలని, జనావాసాలు, పాఠశాల ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.ఈ కమిటీ మీటింగ్ లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జైలర్ 2పై రాజకీయ వేడి

సూపర్‌స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'జైలర్ 2' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సీక్వెల్‌పై అభిమానులతో పాటు సినీ వర్గాల్లోనూ ఆసక్తి నెలకొంది. అయితే సినిమా విడుదలకు ముందే తమిళనాడు రాజకీయ పరిస్థితులకు సంబంధించిన అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో సినిమాలోని కొన్ని సన్నివేశాలు, సంభాషణల్లో మార్పులు చేసే అంశాన్ని చిత్రబృందం పరిశీలిస్తున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.'జైలర్ 2'లో రాజకీయ నేపథ్యాన్ని ప్రతిబింబించే కొన్ని సన్నివేశాలు ఉన్నట్లు గతంలోనే వార్తలు వెలువడ్డాయి. సినిమా షూటింగ్ ప్రారంభమైన సమయంలో ఉన్న రాజకీయ వాతావరణానికి, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులకు మధ్య కొంత వ్యత్యాసం కనిపిస్తోంది. దీంతో అప్పటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన కొన్ని సన్నివేశాలు విడుదల సమయంలో వివాదానికి కారణం కాకుండా ఉండేందుకు మేకర్స్ జాగ్రత్తలు తీసుకుంటున్నారనే టాక్ వినిపిస్తోంది.

ఈ నేపథ్యంలో రాజకీయ ప్రస్తావనలు ఉన్న కొన్ని డైలాగులు, సన్నివేశాలను ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా సవరించే అవకాశం ఉందని సమాచారం. అయితే ఇందులో నిజంగా ఎలాంటి మార్పులు చేస్తున్నారు? ఎన్ని సన్నివేశాలను తిరిగి చిత్రీకరిస్తున్నారు? ఏయే సంభాషణలను తొలగిస్తున్నారు? అనే విషయాలపై ఇప్పటివరకు చిత్రబృందం అధికారికంగా స్పందించలేదు. అందువల్ల ప్రస్తుతం ప్రచారంలో ఉన్న విషయాలను ధృవీకరించని సమాచారంగానే చూడాల్సి ఉంటుంది.సాధారణంగా భారీ బడ్జెట్ చిత్రాల నిర్మాణంలో విడుదలకు ముందు మార్పులు చేయడం కొత్తేమీ కాదు. ఫైనల్ ఎడిటింగ్ సమయంలో దర్శకులు కొన్ని సన్నివేశాలను తొలగించడం, కొత్త సన్నివేశాలు జోడించడం లేదా డైలాగుల్లో మార్పులు చేయడం జరుగుతుంటుంది. ముఖ్యంగా స్టార్ హీరోల సినిమాలకు భారీ స్థాయిలో అంచనాలు ఉండటంతో ప్రేక్షకుల స్పందన, సెన్సార్ పరమైన అంశాలు, సమకాలీన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తుది కట్‌ను సిద్ధం చేస్తుంటారు.మరోవైపు 'జైలర్ 2' విడుదల తేదీపై కూడా ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఇప్పటికే ప్రకటించిన అక్టోబర్ 15 తేదీనే కొనసాగిస్తారా? లేక దీపావళి పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని విడుదలను మార్చుతారా? అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పండుగ సెలవులు లభిస్తే తమిళనాడుతో పాటు తెలుగు, కేరళ, కర్ణాటక మార్కెట్లలోనూ సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.రజినీకాంత్‌కు దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న భారీ మార్కెట్ 'జైలర్ 2'కు ప్రధాన బలంగా నిలవనుంది. అయితే రాజకీయ నేపథ్యానికి సంబంధించిన సన్నివేశాల్లో నిజంగా మార్పులు చేస్తున్నారా? విడుదల తేదీలో ఏమైనా మార్పు ఉంటుందా? అనే అంశాలపై స్పష్టత రావాలంటే చిత్రబృందం అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.



# శ్రీముఖి గ్లామర్ షో అదుర్స్

తెలుగు బుల్లితెరపై తనదైన యాంకరింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీముఖి తాజాగా చేసిన ఫొటోషూట్‌తో మరోసారి వార్తల్లో నిలిచింది. తెలుపు రంగు మినీ డ్రెస్‌పై నీలం, నలుపు రంగుల్లోని 'దిష్టి కన్ను' డిజైన్లు ఉండేలా రూపొందించిన ఈ డ్రెస్‌లో ఆమె స్టైలిష్‌గా కనిపించింది. దానికి సరిపోయే హెడ్‌బ్యాండ్, నియాన్ నెయిల్స్, ఆకట్టుకునే ఆభరణాలను ధరించి శ్రీముఖి చేసిన ఫొటోషూట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఎరుపు రంగు బ్యాక్‌డ్రాప్‌పై నిర్వహించిన ఈ ఫొటోషూట్‌లో ఆమె ఉత్సాహభరితమైన, ఫ్యాషన్‌కు ప్రాధాన్యతనిచ్చే వ్యక్తిత్వం ప్రతిబింబించింది.స్టైలిస్ట్ గ్రీష్మ కృష్ణ.కె, ఫ్రిష్ జ్యువెలరీ, ఫొటోగ్రాఫర్ మనోజ్ గంగుల,ఎలిగెంట్ మేకోవర్ స్టూడియో మేకప్, హెయిర్ స్టైలిస్ట్ మహేశ్ రావులపల్లి ఈ ఫొటోషూట్‌కు తమ ప్రతిభను అందించారు. శ్రీముఖి లుక్‌ను మరింత ప్రత్యేకంగా తీర్చిదిద్దడంలో వీరి పనితనం కనిపించింది.1993 మే 10న తెలంగాణలోని నిజామాబాద్‌లో జన్మించిన శ్రీముఖి తొలుత టెలివిజన్ యాంకర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. 'అదుర్స్', 'సూపర్ సింగర్ 9' వంటి కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ ప్రేక్షకులకు దగ్గరైంది. తన చురుకైన మాటతీరు, హుషారైన యాంకరింగ్‌తో బుల్లితెరపై ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.2012లో అల్లు అర్జున్ హీరోగా నటించిన 'జులాయి' చిత్రంలో రాజీ పాత్రలో కనిపించి శ్రీముఖి సినీరంగ ప్రవేశం చేసింది. ఆ తర్వాత 'ప్రేమ ఇష్క్ కాదల్' చిత్రంలో కథానాయికగా నటించింది. అనంతరం 'నేను శైలజ', 'జెంటిల్‌మన్', 'చంద్రిక', 'క్రేజీ అంకుల్స్', 'మాస్ట్రో', 'భోళా శంకర్' తదితర చిత్రాల్లో పలు పాత్రలు పోషించింది. ఇటీవల 'మా ఇంటి బంగారం'లో అనసూయ పాత్రలోనూ కనిపించింది.2019లో ప్రసారమైన 'బిగ్‌బాస్ తెలుగు 3'లో కంటెస్టెంట్‌గా పాల్గొన్న శ్రీముఖి తన ఆటతీరుతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ సీజన్‌లో తొలి రన్నరప్‌గా నిలిచి మరింత పాపులారిటీ సంపాదించింది. బిగ్‌బాస్ తర్వాత ఆమెకు టెలివిజన్‌లో మరిన్ని అవకాశాలు లభించాయి.ప్రస్తుతం 'బిగ్‌బాస్ అగ్నిపరీక్ష' కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తోంది. ప్రధాన బిగ్‌బాస్ తెలుగు సీజన్‌లోకి వెళ్లే కంటెస్టెంట్ల ఎంపికకు సంబంధించిన ఈ కార్యక్రమం ద్వారా శ్రీముఖి మరోసారి ప్రేక్షకులను అలరిస్తోంది. యాంకరింగ్‌తో పాటు సినిమాల్లోనూ తనకు నచ్చిన పాత్రలను ఎంచుకుంటూ కెరీర్‌ను కొనసాగిస్తోంది. తన ప్రత్యేకమైన స్టైల్, ఎనర్జిటిక్ యాంకరింగ్‌తో తెలుగు టెలివిజన్‌లో ప్రముఖ యాంకర్‌గా శ్రీముఖి తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది.



## రానా కొత్త సినిమా
# ప్రయోగం

టాలీవుడ్ నటుడు, నిర్మాత రానా దగ్గుబాటి ఇప్పుడు సినిమా ప్రదర్శన రంగంలోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. సాధారణ మల్టీప్లెక్స్‌లకు భిన్నంగా చిన్న స్క్రీన్లు, పరిమిత సీట్లతో 'ది అసెంబ్లీ రూమ్స్' పేరుతో బోటిక్ థియేటర్ కాన్సెప్ట్‌ను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఒక్కో థియేటర్‌లో సుమారు 50 నుంచి 80 మంది ప్రేక్షకులు కూర్చునేలా ఏర్పాట్లు చేయనున్నట్లు సమాచారం.ఈ ప్రాజెక్టులో భాగంగా తొలి థియేటర్‌ను ఊటీలో 'ది అసెంబ్లీ రూమ్ జిముటి' పేరుతో ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌లోనూ మరో థియేటర్‌ను నిర్మిస్తున్నట్లు రానా వెల్లడించారు. బెంగళూరులో ఒకటి లేదా రెండు థియేటర్లు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.ఈ థియేటర్ల ప్రధాన ఉద్దేశం కేవలం వ్యాపారం కాకుండా ఇండిపెండెంట్, ప్రత్యామ్నాయ కథలతో తెరకెక్కే చిన్న సినిమాలకు ప్రత్యేక ప్రదర్శనా వేదిక కల్పించడమేనని సమాచారం. భారీ చిత్రాల కారణంగా చిన్న సినిమాలకు స్క్రీన్లు దొరకడం కష్టమవుతున్న నేపథ్యంలో ఈ కాన్సెప్ట్ వారికి ఉపయోగపడే అవకాశం ఉంది. మాల్‌లోని మల్టీప్లెక్స్‌కు బదులుగా కాఫీ షాప్‌కు వెళ్లినంత సులభంగా, ప్రశాంతంగా సినిమా చూసే అనుభూతిని అందించాలన్నది రానా ఆలోచనగా తెలుస్తోంది.



# నిర్మాతగా నిత్యా మీనన్ కొత్త అడుగు

హీరోయిన్లు నటనతో పాటు నిర్మాణ రంగంలోనూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇప్పటికే పలువురు కథానాయికలు నిర్మాతలుగా మారి విభిన్న చిత్రాలను రూపొందిస్తుండగా, ఇప్పుడు నిత్యా మీనన్ కూడా అదే బాటలో అడుగులు వేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 'కేయూరీ ప్రొడక్షన్స్' పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించిన నిత్యా.. కొత్త తరహా కథలను ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.నిత్యా మీనన్‌కు నిర్మాణ రంగం పూర్తిగా కొత్త కాదు. గతంలో 'స్కైలాబ్' చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించింది. అయితే కరోనా సమయంలో విడుదలైన ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఆ తర్వాత కొంతకాలం నిర్మాణానికి దూరంగా ఉన్న నిత్యా.. ఇప్పుడు మరోసారి నిర్మాతగా మారేందుకు సిద్ధమవుతోంది.'కావలై వెండం' ఫేమ్ దర్శకుడు డీకే చెప్పిన కథ నిత్యా మీనన్‌కు నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇందులో ఆమె నటించడంతో పాటు నిర్మాతగానూ భాగస్వామ్యం కానున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ దర్శకుడు విక్రమ్ కె. కుమార్ ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం నిత్యా తన పారితోషికాన్ని తగ్గించుకుని, లాభాల్లో వాటా తీసుకునే విధానాన్ని ఎంచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మరోవైపు తెలుగులో 'భీమ్లా నాయక్' తర్వాత నిత్యా మీనన్ వెండితెరపై పెద్దగా కనిపించలేదు. ఇప్పుడు నిర్మాతగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడంతో పాటు నటిగా కూడా ఆమె ఎలాంటి ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు వస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



# సొంత గడ్డపైనే యశ్‌కు షాక్

మాస్ హీరోల సినిమాలకు సొంత రాష్ట్రంలో భారీ ఓపెనింగ్స్ రావడం సాధారణమే. సినిమా టాక్ ఎలా ఉన్నా స్టార్ హీరోల క్రేజ్, భారీ బడ్జెట్, అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజుల్లోనే గణనీయమైన వసూళ్లు నమోదవుతుంటాయి. అయితే రాకింగ్ స్టార్ యశ్ నటించిన 'టాక్సిక్' విషయంలో కర్ణాటకలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపించింది.యశ్‌కు సొంత రాష్ట్రమైన కర్ణాటకలో ఈ చిత్రం కనీసం రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను కూడా అందుకోలేకపోవడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. యశ్‌కు ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ సినిమా ఈ మైలురాయిని సులభంగా చేరుకుంటుందని అంచనాలు ఉండగా.. విడుదలైన తొలి రోజే మంచి వసూళ్లు సాధించినప్పటికీ ఆ తర్వాత కలెక్షన్లు గణనీయంగా తగ్గినట్లు సమాచారం. ముఖ్యంగా రెండో రోజు నుంచి ఆక్యుపెన్సీ తగ్గడంతో పాటు అడ్వాన్స్ బుకింగ్స్ ఆశించిన స్థాయిలో లేకపోవడం సినిమాపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. అయితే కర్ణాటకలో నిరాశపరిచిన 'టాక్సిక్'కు హిందీ మార్కెట్ కొంత ఊరటనిచ్చింది. ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ చిత్రం కన్నడ వెర్షన్‌తో పోలిస్తే మెరుగైన వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. యశ్‌కు 'కేజీఎఫ్' చిత్రాలతో హిందీ ప్రేక్షకుల్లో ఏర్పడిన క్రేజ్ ఈ సినిమాకు కొంతవరకు ఉపయోగపడినట్లు తెలుస్తోంది.తెలుగు రాష్ట్రాల్లోనూ పరిస్థితి పెద్దగా ఆశాజనకంగా లేదని సమాచారం. తొలి రోజున చెప్పుకోదగ్గ స్థాయిలో ఓపెనింగ్స్ సాధించినప్పటికీ.. రెండో రోజు నుంచి ప్రేక్షకుల ఆదరణ తగ్గడంతో కొన్ని ప్రాంతాల్లో షోలు రద్దయ్యే పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. దీంతో తెలుగులోనూ ఈ చిత్రం బయ్యర్లకు నిరాశను మిగిల్చినట్లు ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారీ అంచనాలతో వచ్చిన 'టాక్సిక్'కు హోమ్ స్టేట్‌తో పాటు తెలుగు మార్కెట్‌లోనూ ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com